
మల్లయ్యకొండ మల్లికార్జున స్వామిని దర్శించుకునేందుకు క్యూ లైన్లలో బారులు తీరిన భక్తులు

సిద్ధేశ్వరుడికి రుద్రాభిషేకం


ప్రత్యేక అలంకరణలో సిద్ధేశ్వరుడు

కలకడ : కలకడ కామాక్షి సమేతా సిద్ధేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రిని పురష్కరించుకొని బుధవారం రుద్రాభిషేకం కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచే కాక కడప జిల్లా పెండ్లిమర్రి, లక్కిరెడ్డిపల్లె, వేంపల్లె, పులివెందుల, ప్రొద్దుటూరు, రాయచోటి, చిన్నమండెం, సంబేపల్లె తదితర మండలలోని పలు ప్రదేశాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొన్నారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయం కిక్కిరిసింది.

హర హర మహాదేవ శంభో శంకర.. ఓం నమఃశివాయ..
అంటూ భక్తుల శివనామస్మరణలతో జిల్లాలోని శైవక్షేత్రాలన్నీ మార్మోగాయి. బుధవారం తెల్లవారుజాము నుంచి భక్తులు ఆలయాలకు పోటెత్తారు. జిల్లాలోని ప్రసిద్ధ శైవక్షేత్రాలైన మల్లయ్యకొండ, చిట్వేలి గుండాలకోన, రాజంపేటలోని హత్యరాల, సిద్దవటంలోని నిత్యపూజస్వామికోనతో పాటు రాయచోటి, రాజంపేట, మదనపల్లె, పీలేరు, రైల్వేకోడూరు తదితర నియోజకవర్గాల్లోని శైవక్షేత్రాలన్నీ భక్తులతో పోటెత్తాయి.

ఓం నమఃశివాయ

- శివాలయాలకు పోటెత్తిన భక్తులు
- తెల్లవారుజాము నుంచే ఆలయాలకు రాక

శివనామస్మరణతో మార్మోగిన మల్లయ్యకొండ


అఖండ మల్లేశ్వరుడి అలంకారంలో దర్శనమిస్తున్న భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి

తంబళ్లపల్లె : కోరిన కోర్కెలు తీర్చే భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న మహాపుణ్యక్షేత్రమైన మల్లయ్యకొండ మల్లన్న మహిమాన్విత స్వరూపాన్ని మహాశివరాత్రి పర్వదినం రోజున దర్శించిన భక్తులు తరించారు. ముక్కంటీశ్వరుని దర్శించుకునేందుకు వేలాదిమంది భక్తులు తరలి వచ్చారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్నాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలి రావడంతో కొండ మొత్తం భక్తులతో కిక్కిరిసిపోయింది. శివరాత్రి పర్వదినాన మల్లికార్జున స్వామి వారు అఖండ మల్లేశ్వరుడి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు.

కిటకిటలాడిన పొలతల


పొలతలకు పోటెత్తుతున్న భక్తులు

పెండ్లిమర్రి : కడప జిల్లాలో ప్రముఖ శైవక్షేత్రం పొలతల మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శివనామస్మరణతో మార్మోగింది. మంగళవారం నుంచే భక్తులు కొండపైకి చేరుకుని బుధవారం తెల్లవారుజామునే కోనేర్లలో స్నానాలు చేసి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. అక్కదేవతల ఆలయం వద్ద తడి బట్టలతో బిడ్డలు లేని, గాలిసోకిన స్త్రీలు వరపడ్డారు. పులిబండెన్న స్వామికి మల్లేశ్వరుడి ఊరేగింపు తర్వాత మొక్కుబడులు ఉన్న భక్తులు జంతు బలులు సమర్పించారు. జిల్లాతో పాటు అన్నమయ్య, అనంతపురం, కర్నూలు, చిత్తూరు, ప్రకాశం, కర్ణాటక నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు.

ధర్మపథంలోని లింగోద్భవ మహాశివుడు


వాల్మీకిపురం ధర్మపథంలోని లింగోద్భవ మహాశివుడు

వాల్మీకిపురం : శివరాత్రి పండుగ సందర్భంగా వాల్మీకిపురం మండలంలోని ధర్మపథం సమూహాలయంలో లింగోద్భవ మహాశివుడికి అభిషేకాలతో పాటు విశేష పూజలు చేశారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అలాగే పట్టణ సమీపంలోని వీరభద్రాద్రి(వీరన్నకొండ)పై బుధవారం రాత్రికి జాగరణ, అభిషేకాలు, గురువారం ఉదయం వీరభద్రస్వామికి విశేష పూజలు, అన్నదాన కార్యక్రమాలు చేపట్టనున్నారు.


మహాశివరాత్రి సందర్భంగా నిత్యపూజకోనలో శివపార్వతుల కల్యాణం

పేదలకు శుభవార్త

- ఇంటి స్థలాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
- ఈ ఏడాది చివరి వరకు దరఖాస్తుకు గడువు

7

అక్రమ నిర్మాణం తొలగింపులో వివాదం

7

- ఆక్రమణదారుడి హల్‌చల్
- ఎక్స్‌కవేటర్‌కు నిప్పు..
- ఆర్ఐపై దాడి..
- నిందితుడిపై హత్యాయత్నం కేసు

హత్యరాలకు పోటెత్తిన భక్తులు

- శివనామస్మరణతో మార్మోగిన త్రేతేశ్వరాలయం


హత్యరాలకు భారీగా వచ్చిన భక్తులు

రాజంపేట టౌన్ : జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన రాజంపేట మండలంలోని హత్యరాల త్రేతేశ్వరస్వామి ఆలయం మహాశివరాత్రి సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. శివనామస్మరణతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. శివరాత్రి సందర్భంగా ఆలయ పరిసరాల్లో మంగళవారం అర్ధరాత్రి నుంచి భక్తులు ఆలయానికి పోటెత్తారు. రైల్వేకోడూరు, రాజంపేట, రాయచోటి, కడప, నెల్లూరు, ఇతర జిల్లాల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో శివరాత్రి సందర్భంగా ఉదయం కపిలేశ్వర ఉత్సవం, రాత్రి శిఖరదీపారాధన, హంస వాహనం, లింగార్చన, నంది ఉత్సవ కార్యక్రమాలు నిర్వహించారు.

కోనంతా జనం...

- శివ నామంతో మార్మోగిన నిత్యపూజకోన


నిత్యపూజకోనకు వెళ్లే అటవీ ప్రాంతంలో నిలిచిపోయిన రాకపోకలు

సిద్దవటం : వ ం డ లం లో ని నిత్యపూజస్వామి కోనకు భక్తులు పోటెత్తారు. ఎటుచూసినా జనమే. తెల్లవారుజాము నుంచే భక్తుల రాక ప్రారంభం కాగా మధ్యాహ్నానికి కోన మొత్తం నిండిపోయి భక్తులు ఎక్కడికక్కడే నిలిచిపోయారు. పంచలింగాల గుడి వద్ద నుంచి కాలినడకన శివపార్వతుల దర్శనానికి వెళ్లే భక్తులకు మార్గమధ్యంలో మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 3 గంటల వరకు రాకపోకలు నిలిచిపోయాయి. ఉదయం శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిగింది. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, తలంబ్రాలు పంపిణీ చేశామన్నారు.

జాతరను విజయవంతం చేయండి

- అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి


మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): అన్ని శాఖల అధికారుల సహకారంతో గంగమ్మ జాతరను విజయవంతం చేయాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక గంగమ్మ ఆలయంలో అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. అనంతపురం గంగమ్మ జాతర అంటే జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా లక్షల సంఖ్యలో భక్తులు వస్తారని, అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. తాగునీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. 24 గంటలూ విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలన్నారు. మహిళలకు ప్రత్యేకంగా మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. అగ్నిమాపక సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. సమావేశంలో రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకుడు మండిపల్లె లక్ష్మీప్రసాద్‌రెడ్డి, మండల అధ్యక్షుడు యనమల మదన్‌మోహన్, ట్రాన్స్‌కో ఎస్ఈ చంద్రశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసులు, తహసీల్దార్ రామాంజనేయులు, ఆలయ ఈవో శ్రీనివాసులు, వైద్యులు సిద్దయ్య, నీలోఫర్ బేగం, పాల్గొన్నారు.

ఆకేపాటి ఎస్టేట్ స్వాధీనం?

- *ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్?*

రాయచోటి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): రాజంపేట ఎమ్మెల్యే, వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమర్‌నాథరెడ్డికి చెందిన ఎస్టేట్‌ను స్వాధీనం చేసుకోవడానికి కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. రాజంపేట మండలం మందపల్లె, ఆకేపాడు గ్రామాల్లో సుమారు 57 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమిని ఆకేపాటి అమర్‌నాథరెడ్డి కుటుంబ సభ్యులు ఆక్రమించుకుని అందులో ఎస్టేట్ ఏర్పాటు చేసుకున్న విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి కార్యాలయ ఆదేశాలతో కలెక్టర్ శ్రీధర్ ఆధ్వర్యంలో జిల్లా రెవెన్యూ అధికారులు విచారణ జరిపి ప్రభుత్వ భూముల్లో అక్రమంగా ఎస్టేట్ నిర్మించినట్లు తేల్చారు. ఈ నేపథ్యంలో ఈ భూములన్నింటినీ స్వాధీనం చేసుకోవాలని రాజంపేట రెవెన్యూ అధికారులకు కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఆకేపాటి ఎస్టేట్‌లో అక్రమాలపై కొన్ని రోజులుగా ఆంధ్రజ్యోతిలో వరుసగా కథనాలు వస్తున్న సంగతి పాఠకులకు విదితమే.

ఏనుగుల దాడి సంఘటనలో

అసలేం జరిగింది...

- శేషాచలంలో 29 ఏనుగులు
- ఏనుగులు కనిపిస్తే ఏం చేయాలంటే...


ఇటీవల శేషాచలంలో కనిపించిన ఒంటరి ఏనుగు

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉర్లగట్టుపోడు, కన్నెగుంట గ్రామాలకు చెందిన 30 మంది తలకోన శివయ్య దర్శనం కోసం సోమవారం కాలినడకన గుండాలకోన సమీప అడ్డదారిలో వెళ్లడంతో మంగళవారం ఏనుగుల దాడిలో ముగ్గురు మృతి చెందడం, నలుగురు గాయపడడం పాఠకులకు విదితమే. ఏనుగులు రాత్రివేళల్లో పొదల్లోనే సంచరించి మేత వేస్తుంటాయి. కాలినడకన వెళ్లిన వారు మొత్తం అడ్డదారిలోనే వెళ్లడంతో వారికి ఏనుగులు తారసపడ్డాయి. శబ్దం చేయడం, కేకలు పెట్టడంతోనే ఏనుగులు దాడికి దిగాయి. గుంపులో పిల్ల ఏనుగులు కూడా ఉన్నట్లు ప్రత్యక్ష సాక్షుల ద్వారా తెలిసింది. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ వంకాయల దినేశ్‌ను ఏనుగు పట్టుకుని కాలితో తొక్కుతుండగా పలిగిల రాజశేఖర్ అనే వ్యక్తి కాపాడే ప్రయత్నంలో కర్రతో పెద్ద ఏనుగుపై కొట్టడంతోనే పిల్ల ఏనుగులు తీవ్ర ఆగ్రహానికి గురై రాజశేఖర్‌ను తొక్కిపెట్టాయని తెలిసింది. ఏనుగులు మేత మేసేటప్పుడు శబ్దం చేయకుండా ఉండాలని తెలియకపోవడం, అవి తారసపడినప్పుడు శబ్దం ఎక్కువగా చేయడం, కేకలు పెట్టడంతోనే దాడి జరిగిందని పలువురు చెబుతున్నారు.

శేషాచలంలో 14.. కర్ణాటక నుంచి 15 ఏనుగులు

శేషాచలం అడవుల్లోకి ప్రస్తుతం సుమారు 400 కిలోమీటర్ల దూరంలో ఉన్న కర్ణాటక రాష్ట్రంలోని బన్నేరుఘట్ట నుంచి 15 ఏనుగులు వలస వచ్చాయి. సుదూర ప్రాంతాల నుంచి ఇక్కడ పిల్లలను ఈనడానికి వస్తాయి. తర్వాత తీసుకునిపోతాయి. ఒక గుంపు మరొక గుంపుతో కలవవు. ఇప్పటికే శేషాచలంలో 14 ఏనుగులు ఉన్నాయి. వలస ఏనుగులతో కలిపి 29కి చేరాయని అటవీశాఖాధికారులు చెబుతున్నారు. ఏనుగులు గుంపుగా జీవించడానికి ఇష్టపడతాయి. ఈ గుంపునకు సాధారణంగా ఒక ఆడ ఏనుగు నాయకత్వం వహిస్తుంది. మనుషుల కన్నా ఎక్కువ జ్ఞాపకశక్తి కలిగిన జీవులు. అటవీశాఖ, పశు సంవర్ధకశాఖాఅధికారులు అందించిన వివరాల మేరకు... ఏనుగులు నీటి జాడను నీటి వాసన, వినికిడి, నేలను తవ్వి గుర్తిస్తాయి. ఏనుగులు మనుషుల్లా అన్ని వైపులా చూడలేవు. పక్కకు లేదా వెనుకకు చూడటం కంటే ముందుకు చూడటంలో కొంత మెరుగ్గా ఉంటాయి. పగటి పూట వాటి కంటి చూపు తక్కువగా రాత్రుళ్లు అవి కదలికలను ఎక్కువగా గుర్తించగలవు. ఏనుగులు పిల్ల ఏనుగులతో ఉన్నప్పుడు పొదల మాటున నిద్రపోవడానికి ఇష్టపడతాయి. గుండాలకోన సమీప దారిలో జరిగిన ఉదంతంలో గ్రామస్థులు దారిలో వెళ్లకుండా పొదలమాటున వెళ్లడం, ఏనుగులను గుర్తించకుండా మరీ దగ్గరకు వెళ్లి వాటిని భయపెట్టాలని గట్టిగా కేకలు వేయడం, టార్చ్‌లైట్ వేయడంతో పిల్ల ఏనుగులకు ఏదో ఆపద వస్తోందని భయపడి మనుషులపై దాడి చేసి ఉంటాయని చెబుతున్నారు.

ఏనుగులు కనిపిస్తే ఏమి చేయాలంటే...

అడవిలో ఏనుగు 100-150 మీటర్ల దూరంలో ఎదురైనప్పుడు వాటికి మన వలన ఎటువంటి ప్రమాదం లేదు అని సూచించే విధంగా ఎటువంటి శబ్దం చేయకుండా ప్రశాంతంగా ఉండాలి. పరుగెత్తడం లేదా మనిషి వీపును వాటి వైపు తిప్పడం చేయకూడదు. ఏనుగును చూసి పరుగెత్తడం వల్ల వెంబడించేలా ప్రేరేపిస్తుంది. దీనివలన పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతుంది. ఏనుగు కదలికలను గమనిస్తూ నెమ్మదిగా వెనుకకు తగ్గాలి. ఒకవేళ ఏనుగు మన వైపు దూసుకు వస్తే దాని నుంచి తప్పించుకోవడానికి ఉత్తమ మార్గం జిగ్‌జాగ్ నమూనాలో పరుగెత్తడం చేయాలి. ఎందుకంటే ఏనుగు శరీరాకృతి వలన జిగ్‌జాగ్‌గా దాని దిశను మార్చుకోవడం కష్టంగా ఉంటుంది. ఇది తప్పించుకోవడానికి మంచి అవకాశం. ఏనుగులు ఎరుపు, తెలుపు వస్త్రాలను చూసినప్పుడు కొంత దూకుడుగా వ్యవహరిస్తాయి. అందుచేత అటవీ సిబ్బంది అడవుల్లోకి వెళుతున్నప్పుడు ఆలివ్ రంగుల దుస్తులను ధరిస్తారు. ప్రజలు, పర్యాటకులు అడవులలోకి అనుమతి తీసుకుని వెళ్లేప్పుడు తగు జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాల నుంచి తప్పించుకోవచ్చు.

సులభమైన మార్గాలు ఎంచుకోవాలి



ఏనుగుల బారి నుంచి తప్పించుకోవాలంటే సులభమైన మార్గాలను ఎంచుకోవాలి. అటవీశాఖ అధికారుల సూచనలు, సలహాలతో అనుమతి తీసుకుని అడవిలోకి వెళ్లాలి. దీనివల్ల ప్రమాదాలు జరగవు. అటవీ మార్గంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలి.

- డాక్టర్ ఎం.గోవిందరాజభాస్కర్, తిరుపతి పశుసంవర్థశాఖ అసిస్టెంట్ డైరెక్టర్

జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలు ఉండవు



అడవిలో జాగ్రత్తలు తీసుకుంటే ఎటువంటి ప్రమాదాలు ఉండవు. పర్యాటకులు అటవీ శాఖ అధికారుల అనుమతి తీసుకుని అడవిలోకి వెళ్లాలి. దీంతో సమస్యలు ఎదురు కావు. అటవీ అనుమతులు లేకుండాపోతే మాత్రం ఇబ్బందులు తప్పవు. అటవీశాఖ అధికారులు, సిబ్బందికి దారులు తెలిసి ఉండడంతో పాటు వన్యప్రాణుల నుంచి ఎలా రక్షించుకోవాలనేది కూడా క్షుణ్ణంగా తెలుస్తుంది.

- టి.ప్రభాకర్‌రెడ్డి, బాలపల్లె అటవీశాఖ, రేంజర్

మళ్లీ చెలరేగిన ఏనుగులు

- గుండాలకోనకు వెళ్లే దారిలో ఉన్న వినాయకుడి గుడి పందిరి ధ్వంసం


వినాయకుడి గుడి పందిరిని ధ్వంసం చేసిన ఏనుగులు

రైల్వేకోడూరు/ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఓబులవారిపల్లె మండలం పరిధిలో ఉన్న గుండాలకోనకు వెళ్లే దారిలో ఉన్న వినాయకుడి గుడి పందిరిని బుధవారం మళ్లీ ఏనుగులు ధ్వంసం చేశాయి. చుట్టుపక్కల చెట్ల కొమ్మలను సైతం విరిచేశాయి. బుధవారం గుండాలకోనకు భక్తులను అటవీశాఖ, పోలీసులు అనుమతించలేదు కాబట్టి పెద్ద ప్రమాదం తప్పింది. అటవీశాఖాధికారులు సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఏనుగుల మంద కోపంతో ఉందని ఏ ప్రమాదం అయినా జరగవచ్చని స్థానికులు, అధికారులు భావిస్తున్నారు. అడవిలో ఏనుగుల మంద ఘీంకారాలు వినిపిస్తున్నాయని అటవీ శివారు గ్రామాల ప్రజలు అంటున్నారు. ఏనుగుల మందలో పలు మదపుటేనుగులు ఉన్నాయని తెలిసింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖాధికారులు చెబుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో చిన్నారి మృతి



సికెదిన్నె, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కడప-రాయచోటి జాతీయ రహదారిలోని వేపమానుసత్రం వద్ద బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో జశ్రితరెడ్డి (8) అనే చిన్నారి మృతి చెందింది. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని బానుపల్లెకు చెందిన వర్ధిరెడ్డి జనార్ధన్‌రెడ్డి భార్య అరుణకుమారి, కుమార్తె జశ్రితరెడ్డి, కుమారుడు శ్రియాన్‌తేజ్‌రెడ్డి కలిసి బెంగుళూరు నుంచి మంగళవారం రాత్రి తన సొంత కారులో బయల్దేరి కడపకు వస్తున్నారు. అదే సమయంలో కడప నుంచి బెంగుళూరుకు వెళుతున్న కారు అతి వేగంతో రాంగ్ రూట్‌లో రావడంతో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జశ్రితారెడ్డి అక్కడికక్కడే మృతి చెందింది. గాయపడిన జనార్ధన్‌రెడ్డి, అరుణకుమారి, తేజ్‌రెడ్డిలను చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. మరో కారులో ఉన్న సద్దాంహుస్సేన్, జహీర్‌లకు గాయాలయ్యాయి. ఘటనపై కేసు నమోదు చేసినట్లు సీకేదిన్నె సీఐ శివశంకర్‌నాయక్ తెలిపారు.

పెన్నానదిలో పడి వ్యక్తి మృతి

చెన్నూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): చెన్నూరుకు చెందిన మాకం వెంకటసుబ్బయ్య (35) అనే వ్యక్తి మద్యం మత్తులో బుధవారం మధ్యాహ్నం పెన్నానదిలో పడి మృతి చెందాడు. మద్యానికి బానిస అయిన వెంకటసుబ్బయ్య నిత్యం మద్యం సేవిస్తూ కుటుంబ సభ్యులను పెట్టేవాడు. దీంతో భార్య రెండేళ్ల క్రితం ఇతన్ని వదిలి పిల్ల పాపలతో విజయవాడ వెళ్లింది. అలాగే తల్లిదండ్రులు సైతం కడప నగర పరిధిలో పాలెంప ల్లెలో నివాసం ఉంటున్నారు. ఈనేపథ్యంలో బుధవారం పెన్నా నదికి స్నానానికి వెళ్లిన వెంకటసుబ్బయ్య అక్కడ పొరపాటున నీటి గుంటలో పడి మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం

● రూ.లక్ష ఆస్తి నష్టం



కాలిపోయిన గృహోపకరణాలు

పెద్దతిప్పసముద్రం ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా గృహోపకరణాలు కాలిపోవడంతో ఓ నిరుపేద కుటుంబం తీవ్రంగా నష్టపోయింది. మండలంలోని సంపతి కోట గ్రామానికి చెందిన గంగంపల్లె శివన్న ఓ నిరుపేద వ్యవసాయ కూలీ. ఇతనికి నలుగురు కుమార్తెలు ఉన్నారు. బుధవారం శివన్న ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగాయి. టీవీ, ఫ్రిజ్, వంట పాత్రలు సహా వస్తువులన్నీ కాలి పోయాయి. ఈ ప్రమాదంలో రూ.లక్ష విలువైన ఆస్తి నష్టపోయి నట్లు అంచనా వేశామని, ఈ మేరకు ప్రభుత్వానికి నివేదికను పంపిస్తామని వీఆర్వో నరేంద్ర తెలిపారు. తక్షణ సాయంగా ఆ కుటుంబానికి ఒక్క బియ్యం ప్యాకెట్‌తో పాటు నిత్యావసర సరుకులు అందించారు. సింగిల్ విండో మాజీ చైర్మన్ సంపతికోట కిట్టన్న బియ్యం ప్యాకెట్‌తో పాటు, రూ.5వేలు అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఎం. చిన్నరెడ్డెప్ప, తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా.. ఒకరి మృతి



నిమ్మనపల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ బోల్తా పడడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై తిప్పేస్వామి తెలిపిన వివరాల మేరకు మండలంలోని రాచవేటి వారిపల్లి పంచాయతీ ఎగువమాచిరెడ్డిగారిపల్లికి చెందిన చంద్రారెడ్డి ఇటుకల ఫ్యాక్టరీలో ఒరిస్సాకు చెందిన పోదన్(29) పని చేస్తున్నాడు. బుధవారం డ్రైవర్ దీపక్‌తో కలసి ఇటుకలను బోయ కొండలో అన్‌లోడ్ చేసి తిరిగి వస్తుండగా బోయకొండ ఆర్చి వద్ద వారు ప్రయాణిస్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పోదన్ ట్రాక్టరులో ఇరుక్కుని అక్కడికక్కడే మృతి చెందగా, డ్రైవర్ దీపక్ తప్పించుని పారిపోయాడు. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు సమాచారం అందించడంతో పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డీఈసీ సభ్యుడు శివహరిప్రసాద్ రెడ్డి మృతి



శివహరిప్రసాద్‌రెడ్డి(ఫైల్)

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణ కమిటీ (డీఈసీ) సభ్యుడు ఎస్.శివహరి ప్రసాద్‌రెడ్డి గుండెపోటుతో మృతి చెందినట్లు డీఈసీ కన్వీనర్ ఆర్ఐఓ వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మృతి పట్ల ఆర్జేడీ రవితో పాటు డీఈసీ సభ్యులు, అధ్యాపకులు సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులను ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అక్రమ నిర్మాణం తొలగింపులో వివాదం

● ఆక్రమణదారుడి హల్‌చల్
● ఎక్స్‌కవేటర్‌కు నిప్పు..
● ఆర్ఐపై దాడి.. పరుగులు తీసిన ఆర్ఐ, వీఆర్వో
● నిందితుడిపై హత్యాయత్నం కేసు





దేవతానగర్‌లో అక్రమణను తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు, ఆక్రమణదారుడు చలపతి నిప్పు పెట్టడంతో కాలిపోయిన ఎక్స్‌కవేటర్ సీట్లు

మదనపల్లె, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఆక్రమణలు తొలగించేందుకు వెళ్లిన అధికారులపై ఆక్రమణదారుడు దాడి చేయడంతో పాటు, ఎక్స్‌కవేటర్‌కు నిప్పు పెట్టాడు. వివరాలిలా ఉన్నాయి. మదనపల్లె మండలం బసినికొండ పంచాయతీ దేవతానగర్‌లోని సర్వేనంబర్ 1029లో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని గిరిజన నాయకుడు చలపతి ఆక్రమించాడని, అందులో ఇల్లు నిర్మిస్తున్నాడంటూ స్థానికులు సబ్‌కలెక్టర్, రెవెన్యూ అధికారులకు వీడియో, ఫొటోలతో ఫిర్యాదు చేశారు. దీనిని సీరియస్‌గా తీసుకున్న సబ్‌కలెక్టర్. ఆక్రమణలను తొలగించాలని తహసీల్దార్ ధనంజయులును ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు వీఆర్వో ప్రసాద్, ఆర్ఐ శేషాద్రిరావు బుధవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో దేవతానగర్‌కు చేరుకున్నారు. ఎక్స్‌కవేటర్‌తో అక్రమ నిర్మాణాన్ని తొలగించేందుకు ప్రయత్నించగా అక్కడే ఉన్న ఆక్రమణదారుడు అడ్డుకున్నాడు. రెవెన్యూ అధికారులు వెనక్కు తగ్గకపోవడంతో ఎక్స్‌కవేటర్ డ్రైవర్‌పై దాడికి పాల్పడగా, భయాందోళనకు గురైన డ్రైవర్ వాహనం దిగి పరుగులు పెట్టాడు. దీంతో ఎక్స్‌కవేటర్‌కు నిప్పంటించి అద్దాలు పగులగొట్టాడు. అతడి ఆగడాలను చిత్రీకరిస్తున్న ఆర్ఐ శేషాద్రిరావును దూషిస్తూ సెల్‌ఫోన్ లాక్కుని కర్రతో దాడి చేశాడు. ఊహించని పరిణామంతో ఆర్ఐ, వీఆర్వోలు అక్కడి నుంచి పరుగులు తీశారు. ఆర్ఐపై జరిగిన దాడి గురించి తెలుసుకున్న రెవెన్యూ అధికారులు, సిబ్బంది వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడున్న స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. అప్పటికే నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. వీఆర్వో ఫిర్యాదు మేరకు నిందితుడు చలపతితో పాటు మరికొందరిపై హత్యాయత్నం, మరో ఐదు సెక్షన్ల కింద తాలూకా సీఐ కళా వెంకటరమణ కేసు నమోదు చేశారు.





సంఘటన స్థలంలో ఆర్ఐ శేషాద్రిరావును విచారిస్తున్న తాలూకా సీఐ కళా వెంకటరమణ, నిందితుడు చలపతి (ఫైల్‌ఫొటో)

కలెక్టర్ సీరియస్

ఆర్ఐపై జరిగిన దాడి, హత్యాయత్నం నేపథ్యంలో కలెక్టర్ చామకూరి శ్రీధర్ సీరియస్ అయ్యారు. నిందితుడిపై చర్యలు తీసుకోవాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడుకు సూచించారు. రెవెన్యూ ఉద్యోగులపై దాడికి ప్రయత్నిస్తే పరిణామాలు ఎలా ఉంటాయో చెప్పే విధంగా చర్యలు ఉండాలని సూచించినట్లు తెలిసింది. మరోవైపు నిందితుడి ఆక్రమణల వ్యవహారంపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని సబ్‌కలెక్టర్‌ను ఆదేశించారు.

భూకబ్జాదారునిపై రెవెన్యూ కొరడా

మదనపల్లె పట్టణం గొల్లపల్లె క్రాస్‌కు చెందిన చలపతిపై రెవెన్యూ అధికారులు కొరడా ఝుళిపించారు. స్థానిక దేవతానగర్‌లో ఆక్రమ నిర్మాణాన్ని తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు, సిబ్బందిపై దాడి సంఘటనతో ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. ఇందులోభాగంగా నిందితుడు ఎక్కడెక్కడ ప్రభుత్వ భూములు, స్థలాలు ఆక్రమించాడో విచారణ చేపట్టాలని కలెక్టర్ శ్రీధర్ తహసీల్దార్ ధనంజయులును ఆదేశించారు. ఇందులో భాగంగా దేవతానగర్‌తో పాటు సీటీఎం క్రాస్ రోడ్డు, ఎస్‌బీఐ కాలనీ (కోమటివాని చెరువు ఆనుకుని), అమ్మచెరువుమిట్ట, తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టాడని రెవెన్యూ సిబ్బంది ప్రాథమికంగా గుర్తించి నివేదిక ఇచ్చారు. దీనిపై ఏరియాల వారీగా వీఆర్వోలతో టీమ్‌లు ఏర్పాటు చేసి తొలగించాలని సూచించారు. ఇందులో భాగంగా అమ్మచెరువుమిట్ట వద్ద నిర్మించిన రేకుల షెడ్డును ఒక టీం ఎక్స్‌వేటర్‌తో తొలగించింది. సీటీఎం క్రాస్ రోడ్డులో నిర్మాణంలో ఉన్న పునాదిని తొలగించి, అక్కడ నిర్మాణానికి సిద్ధం చేసిన ఇసుక, ఇతర సామగ్రిని మరో బృందం తొలగించింది. అలాగే సీటీఎం క్రాస్ రోడ్డులోని అంగళ్లు రోడ్డులో మరో భవనాన్ని నిర్మించి అద్దెకు ఇచ్చినట్లు గుర్తించారు.

దీనిని తొలగించడానికి వీఆర్వో బృందం వెళ్లగా అందులో అద్దెకు ఉన్న వ్యక్తి..గురువారం ఉదయం 10 గంటల వరకు గడవు ఇస్తే ఇంటిని ఖాళీ చేస్తానని చెప్పినట్లు తెలిసింది. మరోవైపు ఎస్‌బీఐ కాలనీతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో చేపట్టిన ఆక్రమణలు తొలగించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇదిలా వుండగా, దేవతానగర్‌లోని సర్వే నెంబర్:1029లో ప్రభుత్వ భూమిలో ఓ వ్యక్తి నిర్మాణం చేస్తుండగా రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. దీనిపై కోర్టుకు వెళ్లిన ఆ వ్యక్తి రెవెన్యూ అధికారులు ప్రవేశించకుండా స్టే తెచ్చుకున్నాడు. అయితే అదే స్థలానికి ఆనుకుని ఉన్న ఖాళీ జాగాలో చలపతి నిర్మాణం చేపట్టాడు. దీనిని అడ్డుకుని తొలగించే క్రమంలో ఈ సంఘటన చోటు చేసుకుంది.

ఎనిమిది సెక్షన్ల కింద కేసు నమోదు

మదనపల్లె దేవతానగర్‌లో అక్రమణ నిర్మాణదారుడు చలపతి, అతడి అనుచరులపై బుధవారం తాలూకా పోలీసులు కేసు నమోదు చేశారు. అక్రమ నిర్మాణాన్ని తొలగించే క్రమంలో బసినికొండ వీఆర్వో జె.ప్రసాద్, ఎక్స్‌వేటర్ డ్రైవర్ రెడ్డెప్ప, ఆర్ఐ శేషాద్రిరావులపై దాడి ఘటన నేపథ్యంలో వీఆర్వో పిర్యాదు మేరకు ఎనిమిది సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నెం:54-2025 కింద కేసు నమోదు చేశారు. ఇందులో బీఎన్ఎస్ సెక్షన్లు 329 (3), 324 (4), 109 (1), 132, 326 (ఎఫ్), 351 (2), 118 (1) రెడ్‌విత్ 3 (5) ఉన్నాయి. హత్యాయత్నం, ప్రభుత్వ భూమి ఆక్రమణ, ప్రభుత్వ ఆస్తి ధ్వంసం (నష్టపరచడం) ఎక్స్‌కవేటర్‌కు నిప్పు పెట్టడం, కర్రలు, కత్తులతో ఉద్యోగులపై దాడి చేయడం, ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించడం, తదితర అంశాలపై తాలూకా పోలీసులు కేసు నమోదు చేశారు.

నిత్యపూజయ్యా.. నీ లీలలు ఎక్కడయ్యా...!

● శివభక్తులకు తప్పని ఇబ్బందులు ● అడుగడుగునా ట్రాఫిక్ జామ్



కాలినడకన అటవీ ప్రాంతంలో నిలిచిపోయిన భక్తుల రాకపోకలు

సిద్దవటం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): శివరాత్రి పర్వదినం సందర్భం గా 'నిత్యపూజయ్యా..! నీ లీలలు ఎక్కడయ్యా!!' అంటూ నిత్యపూజయ్య కోనకు వెళ్లే భక్తులు నిట్టూర్పు విడిచారు. మండలంలోని నిత్యపూజేశ్వర శివరాత్రి మహోత్సవాల సందర్భంగా శివపార్వతుల దర్శనానికి జిల్లా నలుమూలల నుంచి బుధవారం భక్తులు పోటెత్తారు. పంచలింగాల గుడి నుంచి కాలినడకన శివపార్వతుల దర్శనానికి వెళ్లే భక్తులకు మార్గమధ్యంలో మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 3 వరకు రాకపోకలు నిలిచిపోయాయి. తగు జాగ్రత్తలు తీసుకోవడంలో అధికారులు విఫలమయ్యారు.

సన్నిదానంలో గర్భగుడి వద్ద భక్తుల రద్దీ ఎక్కువ కావడంతో గంటల తరబడి నిలిచిపోయారు. దీంతో స్వామివారికి మొక్కుబడులు తెచ్చేవారికి మార్గమధ్యంలో ఇబ్బందులు తలెత్తాయి. మార్గమధ్యంలో రెండో ముఖద్వారం ఆశ్రమం నుంచి పంచలింగాల గుడి వరకు ఏర్పాటు చేసిన రహదారిపై దుమ్ము ఎగిసి పడడంతో భక్తులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. పంచలింగాల గుడి నుంచి సన్నిదానం వరకు అడుగడుగునా భక్తులకు ఇబ్బందులు తలెత్తాయి.



నిత్యపూజకోనకు వెళ్లే రహదారిలో దుమ్ము

గండ్లూరు రామాలయంలో చోరీ

కొండాపురం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండ్లూరు రామాలయంలో మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆలయం తలుపులు పగులగొట్టి.. ఆలయంలోని బీరువాలో ఉంచిన సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ స్వాములకు చెందిన నాలుగు వెండికిరీటాలను చోరీ చేసినట్లు ఆలయ నిర్వాహకుడు పి.సుబ్బారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. 900 గ్రాములు వుండే వీటి విలువ సుమారు రూ.50వేలు ఉంటుందని తెలిపారు. కొండాపురం సీఐ మహమ్మద్‌రఫీ సంఘటన స్థలాన్ని పరిశీలించి... క్లూస్ టీం బృందంతో వివరాలను సేకరించారు. ఆలయ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బంగారు గాజులు, నగదు అపహరణ

సుండుపల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేద్దినేనికాలువ గ్రామపంచాయతీ రెడ్డివారిపల్లెకు చెందిన డీలర్ కరుణ తన రెండు బంగారు గాజులు, రూ.20వేలు నగదు గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం సుండుపల్లెకు సమావేశానికి వచ్చిన సమయంలో ఈ దొంగతనం జరిగినట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

మతి స్థిమితం లేని యువకుడు తల్లిదండ్రులపై కత్తితో దాడి

రాజంపేట టౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): రాజంపేట పట్టణం బలిజపల్లె పూసలకాలనీలో బుధవారం తెల్లవారుజామున మతి స్థిమితం లేని యువకుడు తన తల్లిదండ్రులపై కత్తితో దాడి చేయడంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా... ప్రేమసాయికి భార్యతో పాటు ఇరువురు పిల్లలున్నారు. అతని వేధింపులు తాళలేక భార్య చాలరోజల కింద టపుట్టింటికి వెళ్లిపోయింది.

ఈ నేపథ్యంలో ప్రేమసాయి తన కుమారుని తెల్లవారుజామున బయటకు తీసుకెళుతుండగా ఏమైనా చేస్తాడేమోనని అతన్ని తల్లిదండ్రులు అడ్డుకున్నారు. దీంతో మానసిక స్థితి సరిగా లేని ప్రేమసాయి తన జేబులోని పిడుబాకుతో తండ్రి శ్రీరాములు, తల్లి నాగమ్మల వీపు, పొట్టపై కత్తితో దాడి చేయడంతో తీవ్రగాయలయ్యాయి.దీంతో వెంటనే వారిని కడప రిమ్స్‌కు తరలించారు. ప్రేమసాయిని రాజంపేట పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.



దాడిలో తీవ్రంగా గాయపడిన నాగమ్మ



ప్రేమసాయి (ఫైల్ ఫొటో)

పేదలకు శుభవార్త

● ఇంటి స్థలాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
● ఈ ఏడాది చివరి వరకు దరఖాస్తుకు గడువు

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అభ్యంతరం లేని ప్రభుత్వ భూములను ఆక్రమించు కుని నివాసాలు ఏర్పాటు చేసుకున్న పేదలకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. అలాంటి గృహాలను క్రమబద్ధీకరించేందుకు జీవో నెంబరు 30 జారీ చేస్తూ మార్గదర్శకాలను జారీ చేసింది. ఇన్నాళ్లు ఆక్రమణల పేరుతో పేదల నివాసాలను కూల్చి వేస్తుండటంతో వారు జీవితాంతం కష్టపడి పైసా పైసా కూడబెట్టుకున్న సొమ్ము మట్టిపాలు అవుతోంది. దీనిని గుర్తించిన పలువురు ప్రజాప్రతినిధులు ప్రభుత్వ భూముల్లో గృహాలు ఏర్పాటు చేసుకున్న పేదల ఇళ్లను క్రమబద్ధీకరించాలంటూ ప్రభుత్వానికి విన్నవించారు. దీంతో పేదల ఆర్థిక స్థితిని బట్టి అంచనాలు వేస్తూ కూటమి సర్కారు వంకలు, వాగులు, చెరువుల్లో ఆక్రమణలు కాకుండా.. అభ్యంతరం లేని ప్రభుత్వ స్థలాల్లో చేపట్టిన నిర్మాణాల క్రమబద్ధీకరణకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తూ మార్గదర్శకాలు జారీ చేసింది.

నిబంధనలు ఇలా..

2019 సంవత్సరానికి ముందు నిర్మించుకున్న గృహాలు, భూములు క్రమబద్ధీకరణ జరిగేలా 2019 అక్టోబరు 15 కటాఫ్ డేట్ విధించింది. నిబంధనలు అనుసరించి అర్హతలు ఉంటే ప్రభుత్వం క్రమబద్ధీకరణ చేస్తూ మహిళల పేరుపై పట్టాలివ్వనుంది. తహశీల్దార్ల పర్యవేక్షణలో గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది అక్రమ నిర్మాణాలను గుర్తించనున్నారు. ఈ జాబితాలో అభ్యంతరాల స్వీకరణ, సబ్ డివిజన్ అప్రూవల్ కమిటీ ప్రకటించిన అనంతరం అర్హులకు ఇళ్ల పట్టాలు అందనున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పన్ను చెల్లింపుదారులు, నాలుగు చక్రాల వాహన దారులు ఈపథకానికి అర్హులు కారు. వ్యవసాయ పనులకు ఉపయోగించే ట్రాక్టర్లు, ట్యాక్సీ, ఆటోలకు మాత్రం మినహాయింపు ఇవ్వనున్నారు. లబ్ధిదారులకు కన్వెన్షన్ డీడ్ అందజేసిన రెండేళ్ల తరువాత యాజమాన్య హక్కులు కల్పించేలా ప్రభుత్వ నిర్ణయం తీసుకుంది.

ఫీజులు ఇలా..

క్రమబద్ధీకరణకు సంబంధించి 150 గజాల స్థలం వరకు ఎలాంటి రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించనక్కర లేదు. 151-300 గజాల వరకు రిజిస్టర్ ఫీజులో నిరుపేదలు 15 శాతం, పేదరికానికి ఎగువనున్న వర్గాలు 50 శాతం చెల్లించాలి. 301-450 వరకు బీపీఎల్ వర్గాలు ప్రాథమిక విలువ ప్రకారం 100 శాతం, రిజిస్ట్రేషన్ ఫీజులో 50 శాతం చెల్లించాలి. ఏపీఎల్ వర్గం వారు ప్రాథమిక విలువలో 200 శాతం చెల్లించాలి. 451 గజాల నుంచి ఆపై ఆక్రమించిన నిర్మాణాలకు బీపీఎల్, ఏపీఎల్‌తో సంబంధం లేకుండా నిర్మాణాలను నిర్దాక్షిణ్యంగా తొలగించేలా తాజాగా విడుదల జేసిన జీవోలో పొందుపరిచారు. ఈమేరకు జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు ఒక ప్రకటన విడుదల చేశారు.



అభివృద్ధి, సంక్షేమం చంద్రబాబుకే సాధ్యం: మంత్రి

గాలివీడు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం ముఖ్యమంత్రి చంద్రబాబుకే సాధ్యమని రాష్ట్ర రవాణ, క్రీడా యువజన శాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం గాలివీడు మండల కేంద్రంలో టీడీపీ కార్యాలయానికి ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో రాష్ట్రం ఆర్థికంగా పూర్తిగా దెబ్బతిందని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చక్కదిద్దడానికి కృషిచేస్తున్నారన్నారు. రాయచోటి నియోజకవర్గంలో శాశ్వత మంచినీటి సౌకర్యం కల్పించడానికి రూ.290 కోట్లతో వెలుగల్లు ప్రాజెక్టు నుంచి ఆరు మండలాలకు తాగునీటి సౌకర్య కల్పించడానికి కృషి చేస్తున్నామన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజి వంటి మౌలిక సదుపాయాల కల్పనకు నిధులను కేటాయించారన్నారు. అనంతరం ప్రజల అర్జీలను స్వీకరించారు.

అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

చిన్నమండెం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ప్రజాదర్బార్‌లో వచ్చిన అర్జీలను అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని రాష్ట్ర రవాణ, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం బోరెడ్డిగారిపల్లెలో నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలు పరిష్కరించాలన్నారు. భూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని రెవెన్యూ అధికారులు ప్రత్యేక శ్రద్ధపెట్టాలన్నారు.

చాందినీ బండ్ల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరి: డీఎస్పీ

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): లక్కిరెడ్డపల్లె గంగమ్మజాతరలో చాందినీ బండ్లు ఏర్పాటు చేసుకొనేవారు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని డీఎస్పీ క్రిష్ణమోహన్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక గంగమ్మతల్లి ఆలయం వద్ద విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 1,2 తేదీలలో జరగబోయే గంగమ్మజాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 300 మంది పోలీసు బందోబస్తు నియమిస్తున్నామన్నారు. డీఎస్పీతో పాటు ఏడుగురు సీఐలు, 12 మంది ఎస్‌ఐలు అలాగే హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు, మహిళా పోలీసులను ఏర్పాటు చేస్తామన్నారు. నాలుగు ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేశామని, చాందినీ బండ్లు 10 అడుగుల ఎత్తుకు మించి ఉండకూడదన్నారు. అన్నిరకాల ధ్రువపత్రాలతో పోలీసుల అనుమతులు పొందాలన్నారు. డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలను నడిపితే కఠిన చర్యలు తప్పవన్నారు. అశ్లీల నృత్య ప్రదర్శనలు, ఎక్కువగా బాణసంచా పేల్చడం తగ్గించాలన్నారు. జాతర ప్రాంగణమంతా సీసీ కెమరాలు, డ్రోన్ కెమరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ కొండారెడ్డి, ఎస్‌ఐ రవీంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

మందహాస మండపం వితరణ

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లపల్లె చెల్లు వంశీయుల గుడిలో ఉన్న గంగమ్మతల్లికి అనంతపురం ఈడిపల్లె యూపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు వీరబల్లి వెంకటరమణ మందహాస మండపం (పూజమందిరం) అందజేశారు. గంగమ్మజాతర ముందురోజున అమ్మవారిని పెట్టెలో నుంచి బయటకు తీసి గంపలో నిలపెడతారు. తర్వాత అమ్మవారిని మందహాస మండపంలో ఉంచాలని, రూ.50వేలు వెచ్చించి తయారు చేయించామని వెంకటరమణ తెలిపారు.

నిధులు మంజూరు చేయాలి

రాజంపేట టౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : భవన కార్మికుల సంక్షేమ బోర్డుకు రావాల్సిన నిధులను జగన్‌రెడ్డి ప్రభుత్వం దారి మళ్లించిందని, వెంటనే మంజూరు చేయాలని ఏఐటీయూసీ నేతలు కోరారు. బుధవారం పట్టణంలోని కార్యాలయంలో బిల్డర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ దారిమళ్లిన రూ.1200 కోట్ల నిధులు బోర్డులో జమ చేసి కార్మికులను ఆదుకోవాలని కోరారు.

జూదరుల అరెస్ట్

సుండుపల్లి, ఫిబ్రవరి26 (ఆంధ్రజ్యోతి): సుండుపల్లి మండలంలోని పెద్దినేనికాలువ గ్రామ పంచాయతీ బూడిదేటిపల్లి సమీపంలోని మామిడి తోటలో పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు బుధవారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.22,010 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. మరో ఇద్దరు పరారైనట్లు పేర్కొన్నారు.

శంభో..శివశంభో



పట్టు వస్త్రాలు తీసుకెళ్తున్న మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి



హత్యరాలలో శివపార్వతుల కల్యాణం



నందలూరులో కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



ఊటుకూరులో శివపార్వతుల కల్యాణానికి హాజరైన భక్తులు

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం ఆలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. ఆలయాల వద్ద నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. శివపార్వతుల కల్యాణం కన్నులపండువగా జరిగింది. రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాలలోని అన్ని శివాలయాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో శివయ్యకు పూజలు చేశారు.

సిద్దవటం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వంతాటిపల్లె గ్రామం లంకమల్ల అటవీ ప్రాంతంలో వెలసిన నిత్యపూజేశ్వర, శివపార్వతుల మూలవిరాట్ విగ్రహాలకు కల్యాణం చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సుబ్రమణ్యంశర్మ మాట్లాడుతూ శివపార్వతుల కల్యాణం జరిపించామని అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, తలంబ్రాలు పంపిణీ చేశామన్నారు. ఆలయ చైర్మన్ జ్యోతి వెంకటసుబ్బారెడ్డి, ఎండోమెంట్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ శివయ్య పాల్గొన్నారు.

శివుని సేవలో ఎమ్మెల్యే

పెనగలూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని తూర్పుపల్లెలో బోడమల్లేశ్వరస్వామిని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ దర్శించుకున్నారు. పలు శివాలయాల్లో పూజలు ఘనంగా నిర్వహించారు. జెట్టివారిపల్లె నాగలింగేశ్వరస్వామి, కామాక్షి పూజల్లో టీడీపీ నాయకురాలు ముక్కా వరలక్ష్మి, బీఎల్ నరసింహారెడ్డి, కోడూరు వెంకటయ్య, వెంకటసుబ్బయ్య, వి.గురవయ్య, పి.మహేంద్ర, చిన్నపరెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

బి.కమ్మపల్లె శివాలయంలో...

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : బి.కమ్మపల్లె పంచాయతీలో వెలసిన ఉమాదేవి సమేత గోకర్ణేశ్వరాలయంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. బొమ్మవరం గ్రామ నాయకులు, ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు పాల్గొన్నారు.ముక్కా రూపానందరెడ్డి కుటుంబ సభ్యులు, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



చిట్వేలి: ప్రత్యేక అలంకారంలో వీరభద్రుడు

రైల్వేకోడూరు: పట్టణంలోని శ్రీభుజంగేశ్వరస్వామి ఆలయాలలో భక్తులు పోటేత్తారు. స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు పంపిణీ, అన్నదానం చేశారు.

రైల్వేకోడూరు రూరల్: రాఘవరాజుపురం పంచాయతీలో వెలసిన భ్రమరాంబిక మల్లికార్జున స్వామి కల్యాణాన్ని వేద పండితులు బోయలకుంట్ల మల్లికార్జునశర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

నందలూరు: నందలూరు ఉల్లంగేశ్వరస్వామి ఆలయం, అర్ధనారీశ్వరాలయం,కన్యాశ్రమ శివాలయం, చింతకాయలపల్లెలోని కామాక్షి సమేత బోల మల్లేశ్వరస్వామి, పొత్తపిలోని మూలస్థానేశ్వరస్వామి, లేబాక శివాలయం, నారాయణరాజుపేట శివాలయాలు కిటకిటలాడాయి.

హత్యరాలలో పోటెత్తిన భక్తులు

రాజంపేట టౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన రాజంపేట మండలంలోని హత్యరాల త్రేతేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకటిలాడింది. మన్నూరు సీఐ అధ్వర్యంలో 150 మంది పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే పట్టణంలోని సాయినగర్‌లో ప్రజాపిత ఈశ్వరయ్య, బ్రహ్మకుమారి విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ద్వా దశ జ్యోతిర్లింగాల దివ్యదర్శనాన్ని ఏర్పాటు చేశారు.



రైల్వేకోడూరు భుజంగేశ్వరస్వామి ఆలయంలో పోటెత్తిన భక్తులు



రాజంపేట పట్టణం సాయినగర్‌లో జ్యోతిర్లింగాల దివ్యదర్శనం



రైల్వేకోడూరు రూరల్: రాఘవరాజుపురంలో స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



పెనగలూరు: తూర్పుపల్లెలో బోడమల్లేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీ నాయకురాలు ముక్కా వరలక్ష్మి, నరసింహారెడ్డి

రాయచోటి శివాలయాల్లో శివరాత్రి వేడుకలు

సంబేపల్లి/సుండుపల్లి ఫిబ్రవరి 26 ఆంధ్రజ్యోతి: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవా రం రాయచోటి నియోజకవర్గంలోని శివాల యాల్లో భక్తుల సందడి నెలకొంది. సుండుపల్లి మండలంలో తిమ్మసముద్రం, సుండుపల్లి, చింతలయ్యగారిపల్లి, రాగిమానిబిడికి, అగ్రహారం, భైరవగుట్ట, బలిజపల్లి, విరూపాక్ష చేన్నకేశవ స్వామి ఆలయంలో భక్తులు పూజలు చేశారు. చెన్నంశెట్టిపల్లి గ్రామస్తులు దాదాపు రెండు వేల మందికి అన్నదానం నిర్వహించారు. చింతలయ్యగారిపల్లిలోవెంకటరామిరెడ్డి కుటుంబీకులు అన్న దానం చేశారు. తిరుమల ఏజెన్సీ నిర్వాహకులు 108 కిలోల పంచలోహ ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు.

రాయచోటి: రాయచోటిలోని అగస్త్రేశ్వరాలయం, మదనపల్లి రోడ్డులోని ఉమామహేశ్వర అలయం, చలంపల్లి కాశీ విశ్వేశరాలయాలో శివపార్వతుల కల్యాణం, అన్నదానం నిర్వహించారు.

సంబేపల్లి: మోటకట్ల వెంకటశివసాయి అలయంలో అభిషేకాలు నిర్వహించారు. సంబేపల్లి పశుపతి ఆలయంలో కల్యాణం చేశారు.

రామాపురం: చిన్నజంగంపల్లి చంద్రమౌళీశ్వర ఆలయం, కల్పనాయని చెరువు శివాలయంలో మంత్రి రాంప్రసాద్ రెడ్డి పూజలు చేశారు.

పరమ శివుని కృపతో సుభిక్షంగా ఉండాలి

రాయచోటి టౌన్ ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): పరమశివుని కృపతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడి సతీమణి సంపతి భవ్య ఆకాక్షించారు. ఎస్ఎన్‌కాలనిలో ఉమామహేశ్వర ఆలయంలో పూజలు చేశారు.

లక్కిరెడ్డిపల్లెలో...

లక్కిరెడ్డిపల్లె సర్వమంగళాదేవి సమేత రామలింగేశ్వర స్వామి, దేవళంపల్లె శివాలల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అర్చకుడు హరినాథశర్మ, ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు.

వీరభద్రస్వామికి పట్టు వస్త్రాల సమర్పణ

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వీరభద్రుడి బ్రహ్మోత్సవాలు నిర్వహించాలని మంత్రి మండిపల్లె రాంప్రసాద్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మహాశివరాత్రి సందర్భంగా మంత్రి బుధవారం వీరభద్ర స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో టీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చక స్వాములు వేదమంత్రోచ్చారణల మధ్య మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.



లక్కిరెడ్డిపల్లి: ప్రత్యేక అలంకారంలో రామలింగేశ్వర స్వామి



సుండుపల్లిలో శివపార్వతుల గ్రామోత్సవం



సంబేపల్లి శివాలయంలో శివునికి అభిషేకం



శివపార్వతుల కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎస్పీ సతీమణి సంపతి భవ్య

బాధితులకు అండగా ఉంటాం

● యానాదుల సంక్షేమ సంఘం



మాట్లాడుతున్న సంక్షేమ సంఘం సభ్యులు

రైల్వేకోడూరు రూరల్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ఏనుగుల దాడిలో మృతి చెందిన బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని యానాదుల సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి పులి శివశంకర్ అన్నారు. బుధవారం సంక్షేమ సంఘం సభ్యులతో కన్నెగుంట యానాది కాలనీని ఆయన పరిశీలించారు. జిల్లా ఉపాధ్యక్షుడు సికోలి బాలాజీ, జిల్లా కార్యవర్గ నిర్వాహ కార్యదర్శి పాలెపు చెంగల్ రాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు శీను, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వై.కోట అటవీ ప్రాంతంలోకి వెళ్లడానికి వీలులేదు : అటవీశాఖ అధికారులు

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వై.కోట అటవీ శాఖ రిజర్వు ఫారెస్ట్‌లో వెలసిన శ్రీ నీలకంఠేశ్వరస్వామి దర్శనానికి గుండాలకోనకు వెళ్లడానికి వీలులేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు అటవీశాఖ అధికారులు, రైల్వేకోడూరు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం నాడు రైల్వేకోడూరు ప్రాంతానికి చెందినవారు చిత్తూరు జిల్లాలో ఉన్న తలకోనకు వెళ్లడానికి అడవి ద్వారా వెళ్లి ఏనుగుల గుంపు దాడిలో కొందరు మృతిచెంది మరికొందరు గాయాలపాలైన ఘటనను దృష్టిలో ఉంచుకుని అడవి మార్గం ద్వారా వెళ్లడానికి జిల్లాస్థాయి ఉన్నతాధికారులు తీవ్రమైన ఆకాంక్షలు విధించిన నేపథ్యంలో తాము ఇక్కడ అమలు చేస్తున్నామని భక్తులు అర్థం చేసుకోవాలని తెలిపారు. అటవీశాఖాధికారులు, ఓబులవారిపల్లె ఎస్‌ఐ మహేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వై.కోట అటవీ ప్రాంతంలోకి ఎవరూ ప్రవేవించకుండా కాపలాగా ఉన్న అటవీ శాఖ పోలీసు అధికారులు

రాష్ట్రస్థాయి టెన్నిస్‌బాల్‌లో ప్రతిభ



హనిప్రియాంకను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

నందలూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : సీనియర్ స్టేట్ లెవల్ 12వ మెన్ అండ్ ఉమెన్ చాంపియన్‌షిప్ టెన్నిస్‌బాల్ క్రికెట్‌లో స్థానిక విభా ఎరుడైట్ స్కూల్ విద్యార్థిని వేపగుంట హనిప్రియాంక కడప జిల్లా బాలికల టీమ్‌లో ఆడి అత్యుత్తమ ప్రతిభతో జట్టు విజయానికి కృషి చేసింది. తిరుపతి జిల్లా చంద్రగిరిలో జరిగిన ఆంధ్రప్రదేశ్ టెన్నీస్‌బాల్ క్రికెట్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో 12వ సీనియర్‌స్టేట్ లెవల్ చాంపియన్‌షిప్‌ను జిల్లా బాలికల జట్టు మొదటి స్థానంను కైవసం చేసుకుంది. విభా ఎరుడైట్ చైర్మన్ డాక్టర్ జయభాస్కర్‌రావు మొమెంటో అందజేసి అభినందించారు.

ద్విచక్రవాహనానికి నిప్పు

సుండుపల్లి, ఫిబ్రవరి26 (ఆంధ్రజ్యోతి): స్థానికంగా ఉంటున్న జగిలి వెంకటరమణకు చెందిన ద్విచక్ర వాహనం (స్కూటి)కు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారని ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు శ్రీనివాసులు తెలిపారు.

జగనన్న కాలనీలు పూర్తయ్యేదెన్నడో...

గాలివీడు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన జగనన్న కాలనీల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. ఇంటి నిర్మాణాలకు భారీగా వ్యయం పెరగడంతో లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదు. ప్రభుత్వం ఇచ్చే మొత్తం ఏ మూలకూ సరిపోవడం లేదు. కాగా కూటమి ప్రభుత్వం జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలకు విధించిన గడువు పూర్తయినా లబ్ధిదారులు మాత్రం ఇళ్లను పూర్తి చేయలేదు. మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో వైసీపీ ప్రభుత్వం 20 జగనన్న కాలనీల ఏర్పాటుకు యత్నించింది. ఇందులో అరవీడు పంచాయతీలో 71 ఇళ్లు, గాలివీడు పంచాయతీలో 250, గరుగుపల్లి, గుండ్లపల్లి పంచాయతీల్లో పది ఇళ్లు, కొర్లకుంట పంచాయతీలో 29, నూలివీడు పంచాయతీలో 49, పూలికుంట పంచాయతీలో 13, తలముడిపిలో 3, తూముకుంటలో 6, వెలిగల్లులో 124 ఇళ్ల నిర్మాణాలకు వైసీపీ ప్రభుత్వం అనుమతించింది. కానీ ఇందులో 126 గృహాలు ఇంతవరకు నిర్మాణాలకు నోచుకోలేదు. 242 గృహాలు పునాదులకు పరిమితం కాగా 46 ఇళ్లు గోడల వరకు, 49 మోల్డింగ్ వరకు పూర్తయినట్లు అధికారులు పేర్కొన్నారు.

అరకొర వసతులతో జగనన్న కాలనీలు

జగనన్న కాలనీల్లో భాగంగా కొన్ని కాలనీల్లో విద్యుత్ సౌకర్యం కల్పించారు. రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి కొరత ఎక్కువగా ఉంది. పూలకుంట ఆవులవాండ్లపల్లెకుసమీపంలో నల్లగుట్టలో, బత్తినవాండ్లపల్లె, రాంరెడ్డిగారిపల్లెలో ఒకటి, రెండు తప్ప ఇంతవరకు ఇంటి నిర్మాణాలు పూర్తి కాలేదు. ఆవులవాండ్లపల్లెకు సమీపంలోని నల్లగుట్టలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణాలు పునాదులకే పరిమితమయ్యా యి. పూలకుంట పంచాయతీ ఎస్సీ కాలనీకి సమీపంలో ఇంటి స్థలాలు ఎవ్వరికీ ఇవ్వలేదు. అందులో ఒక వ్యక్తి ఉలవపంటను సాగు చేశాడు. నూలివీడు పంచాయతీ ఆవులవాండ్లపల్లెకు సమీపంలో నల్లగుట్టలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీ ఊరికి దూరంగా ఉండడం వల్ల ఎవ్వరూ ముందుకు రావడంలేదు. కొన్ని కాలనీల్లో ఇంటి నిర్మాణాలకు ఎవరూ ముందుకు రావడం లేదు. ఒక్కొక్క ఇంటి నిర్మాణానికి అప్పటి వైసీపీ ప్రభుత్వం రూ.1.70 లక్షలు కానీ ప్రస్తుత ధరలు ప్రకారం ఒక్కొక్క ఇంటి నిర్మాణానికి రూ.నాలుగు లక్షల వరకు ఖర్చు అవుతుందని లబ్ధిదారులు పేర్కొంటున్నారు. ఇంటి నిర్మానాలు చేపడితే అప్పులు పాలు కాక తప్పదంటున్నారు. కాగా కూటమి ప్రభుత్వం 2024 డిసెంబరు 31 వరకు ఈ నిర్మాణాలకు గడువు విధించినప్పటికీ లబ్ధిదారులు వాటిని చాలా వరకు పూర్తి చేయలేదు.



నూలివీడు పంచాయతీలో పునాదులకే పరిమితమైన జగనన్న కాలనీ

అక్రమ నిర్మాణం తొలగింపులో వివాదం

- ఆక్రమణదారుడి హల్‌చల్
- ఎక్స్‌కవేటర్‌కు నిప్పు..
- ఆర్‌ఐపై దాడి.. పరుగులు తీసిన ఆర్‌ఐ, వీఆర్‌వో
- నిందితుడిపై హత్యాయత్నం కేసు

మదనపల్లె, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఆక్రమణలు తొలగించేందుకు వెళ్లిన అధికారులపై ఆక్రమణదారుడు దాడి చేయడంతో పాటు, ఎక్స్‌కవేటర్‌కు నిప్పు పెట్టాడు. వివరాలిలా ఉన్నాయి. మదనపల్లె మండలం బసినికొండ పంచాయతీ దేవతానగర్‌లోని సర్వేనంబర్ 1029లో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని గిరిజన నాయకుడు చలపతి ఆక్రమించాడని, అందులో ఇల్లు నిర్మిస్తున్నాడంటూ స్థానికులు సబ్‌కలెక్టర్, రెవెన్యూ అధికారులకు వీడియో, ఫొటోలతో ఫిర్యాదు చేశారు. దీనిని సీరియస్‌గా తీసుకున్న సబ్‌కలెక్టర్. ఆక్రమణలను తొలగించాలని తహసీల్దార్ ధనంజయులును ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు వీఆర్వో ప్రసాద్, ఆర్‌ఐ శేషాద్రిరావు బుధవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో దేవతానగర్‌కు చేరుకున్నారు. ఎక్స్‌కవేటర్‌తో అక్రమ నిర్మాణాన్ని తొలగించేందుకు ప్రయత్నించగా అక్కడే ఉన్న ఆక్రమణదారుడు అడ్డుకున్నాడు. రెవెన్యూ అధికారులు వెనక్కు తగ్గకపోవడంతో ఎక్స్‌కవేటర్ డ్రైవర్‌పై దాడికి పాల్పడగా, భయాందోళనకు గురైన డ్రైవర్ వాహనం దిగి పరుగులు పెట్టాడు. దీంతో ఎక్స్‌కవేటర్‌కు నిప్పంటించి అద్దాలు పగులగొట్టాడు. అతడి ఆగడాలను చిత్రీకరిస్తున్న ఆర్‌ఐ శేషాద్రిరావును దూషిస్తూ సెల్‌ఫోన్ లాక్కుని కర్రతో దాడి చేశాడు. ఊహించని పరిణామంతో ఆర్‌ఐ, వీఆర్వోలు అక్కడి నుంచి పరుగులు తీశారు. ఆర్‌ఐపై జరిగిన దాడి గురించి తెలుసుకున్న రెవెన్యూ అధికారులు, సిబ్బంది వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడున్న స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. అప్పటికే నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. వీఆర్వో ఫిర్యాదు మేరకు నిందితుడు చలపతితో పాటు మరికొందరిపై హత్యాయత్నం, మరో ఐదు సెక్షన్ల కింద తాలూకా సీఐ కళా వెంకటరమణ కేసు నమోదు చేశారు.



దేవతానగర్‌లో ఆక్రమణను తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు, ఆక్రమణదారుడు చలపతి నిప్పు పెట్టడంతో కాలిపోయిన ఎక్స్‌కవేటర్ సీట్లు

కలెక్టర్ సీరియస్

ఆర్‌ఐపై జరిగిన దాడి, హత్యాయత్నం నేపథ్యంలో కలెక్టర్ చామకూరి శ్రీధర్ సీరియస్ అయ్యారు. నిందితుడిపై చర్యలు తీసుకోవాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడుకు సూచించారు. రెవెన్యూ ఉద్యోగులపై దాడికి ప్రయత్నిస్తే పరిణామాలు ఎలా ఉంటాయో చెప్పే విధంగా చర్యలు ఉండాలని సూచించినట్లు తెలిసింది. మరోవైపు నిందితుడి ఆక్రమణల వ్యవహారంపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని సబ్‌కలెక్టర్‌ను ఆదేశించారు.

భూకబ్జాదారునిపై రెవెన్యూ కొరడా

మదనపల్లె పట్టణం గొల్లపల్లె క్రాస్‌కు చెందిన చలపతిపై రెవెన్యూ అధికారులు కొరడా ఝుళిపించారు. స్థానిక దేవతానగర్‌లో అక్రమ నిర్మాణాన్ని తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు, సిబ్బందిపై దాడి సంఘటనతో ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. ఇందులోభాగంగా నిందితుడు ఎక్కడెక్కడ ప్రభుత్వ భూములు, స్థలాలు ఆక్రమించాడో విచారణ చేపట్టాలని కలెక్టర్ శ్రీధర్ తహసీల్దార్ ధనంజయులును ఆదేశించారు. ఇందులో భాగంగా దేవతానగర్‌తో పాటు సీటీఎం క్రాస్ రోడ్డు, ఎస్‌బీఐ కాలనీ (కోమటివాని చెరువు ఆనుకుని), అమ్మచెరువుమిట్ట, తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టాడని రెవెన్యూ సిబ్బంది ప్రాథమికంగా గుర్తించి నివేదిక ఇచ్చారు. దీనిపై ఏరియాల వారీగా వీఆర్వోలతో టీమ్‌లు ఏర్పాటు చేసి తొలగించాలని సూచించారు. ఇందులో భాగంగా అమ్మచెరువుమిట్ట వద్ద నిర్మించిన రేకుల షెడ్డును ఒక టీం ఎక్స్‌వేటర్‌తో తొలగించింది. సీటీఎం క్రాస్ రోడ్డులో నిర్మాణంలో ఉన్న పునాదిని తొలగించి, అక్కడ నిర్మాణానికి సిద్ధం చేసిన ఇసుక, ఇతర సామగ్రిని మరో బృందం తొలగించింది. అలాగే సీటీఎం క్రాస్ రోడ్డులోని అంగళ్ల రోడ్డులో మరో భవనాన్ని నిర్మించి అద్దెకు ఇచ్చినట్లు గుర్తించారు.

దీనిని తొలగించడానికి వీఆర్వో బృందం వెళ్లగా అందులో అద్దెకు ఉన్న వ్యక్తి..గురువారం ఉదయం 10 గంటల వరకు గడవు ఇస్తే ఇంటిని ఖాళీ చేస్తానని చెప్పినట్లు తెలిసింది. మరోవైపు ఎస్‌బీఐ కాలనీతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో చేపట్టిన ఆక్రమణలు తొలగించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇదిలా వుండగా, దేవతానగర్‌లోని సర్వే నెంబర్:1029లో ప్రభుత్వ భూమిలో ఓ వ్యక్తి నిర్మాణం చేస్తుండగా రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. దీనిపై కోర్టుకు వెళ్లిన ఆ వ్యక్తి రెవెన్యూ అధికారులు ప్రవేశించకుండా స్టే తెచ్చుకున్నాడు. అయితే అదే స్థలానికి ఆనుకుని ఉన్న ఖాళీ జాగాలో చలపతి నిర్మాణం చేపట్టాడు. దీనిని అడ్డుకుని తొలగించే క్రమంలో ఈ సంఘటన చోటు చేసుకుంది.



సంఘటన స్థలంలో ఆర్‌ఐ శేషాద్రిరావును విచారిస్తున్న తాలూకా సీఐ కళా వెంకటరమణ, నిందితుడు చలపతి (ఫైల్‌ఫొటో)

ఎనిమిది సెక్షన్ల కింద కేసు నమోదు

మదనపల్లె దేవతానగర్‌లో అక్రమణ నిర్మాణదారుడు చలపతి, అతడి అనుచరులపై బుధవారం తాలూకా పోలీసులు కేసు నమోదు చేశారు. అక్రమ నిర్మాణాన్ని తొలగించే క్రమంలో బసినికొండ వీఆర్వో జె.ప్రసాద్, ఎక్స్‌వేటర్ డ్రైవర్ రెడ్డెప్ప, ఆర్‌ఐ శేషాద్రిరావులపై దాడి ఘటన నేపథ్యంలో వీఆర్వో ఫిర్యాదు మేరకు ఎనిమిది సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నెం:54-2025 కింద కేసు నమోదు చేశారు. ఇందులో బీఎన్‌ఎస్ సెక్షన్లు 329 (3), 324 (4), 109 (1), 132, 326 (ఎఫ్), 351 (2), 118 (1) రెడ్‌విత్ 3 (5) ఉన్నాయి. హత్యాయత్నం, ప్రభుత్వ భూమి ఆక్రమణ, ప్రభుత్వ ఆస్తి ధ్వంసం (నష్టపరచడం) ఎక్స్‌కవేటర్‌కు నిప్పు పెట్టడం, కర్రలు, కత్తులతో ఉద్యోగులపై దాడి చేయడం, ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించడం, తదితర అంశాలపై తాలూకా పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో చిన్నారి మృతి



సికెదిన్నె, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కడప-రాయచోటి జాతీయ రహదారిలోని వేపమానుసత్రం వద్ద బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో జశ్రితరెడ్డి (8) అనే చిన్నారి మృతి చెందింది. పోలీసుల వివరాల మేరకు.. మండలం లోని బానుపల్లెకు చెందిన వర్దిరెడ్డి జనార్ధన్‌రెడ్డి భార్య అరుణకుమారి, కుమార్తె జశ్రితరెడ్డి, కుమారుడు శ్రియాన్‌తేజ్‌రెడ్డి కలిసి బెంగుళూరు నుంచి మంగళవారం రాత్రి తన సొంత కారులో బయల్దేరి కడపకు వస్తున్నారు. అదే సమయంలో కడప నుంచి బెంగుళూరుకు వెళుతున్న కారు అతి వేగంతో రాంగ్ రూట్‌లో రావడంతో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జశ్రితారెడ్డి అక్కడికక్కడే మృతి చెందింది. గాయపడిన జనార్ధన్‌రెడ్డి, అరుణకుమారి, తేజ్‌రెడ్డిలను చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. మరో కారులో ఉన్న సద్దాంహుస్సేన్, జహీర్‌లకు గాయాలయ్యాయి. ఘటనపై కేసు నమోదు చేసినట్లు సీకేదిన్నె సీఐ శివశంకర్‌నాయక్ తెలిపారు.

పెన్నానదిలో పడి వ్యక్తి మృతి

చెన్నూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): చెన్నూరుకు చెందిన మాకం వెంకటసుబ్బయ్య (35) అనే వ్యక్తి మద్యం మత్తులో బుధవారం మధ్యాహ్నం పెన్నానదిలో పడి మృతి చెందాడు. మద్యానికి బానిస అయిన వెంకటసుబ్బయ్య నిత్యం మద్యం సేవిస్తూ కుటుంబ సభ్యులను పెట్టేవాడు. దీంతో భార్య రెండేళ్ల క్రితం ఇతన్ని వదిలి పిల్ల పాపలతో విజయవాడ వెళ్లింది. అలాగే తల్లిదండ్రులు సైతం కడప నగర పరిధిలో పాలెంప ల్లెలో నివాసం ఉంటున్నారు. ఈనేపథ్యంలో బుధవారం పెన్నా నదికి స్నానానికి వెళ్లిన వెంకటసుబ్బయ్య అక్కడ పొరపాటున నీటి గుంటలో పడి మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం

- రూ.లక్ష ఆస్తి నష్టం


కాలిపోయిన గృహోపకరణాలు

పెద్దతిప్పసముద్రం ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా గృహోపకరణాలు కాలిపోవడంతో ఓ నిరుపేద కుటుంబం తీవ్రంగా నష్టపోయింది. మండ లంలోని సంపతి కోట గ్రామానికి చెందిన గంగంపల్లె శివన్న ఓ నిరుపేద వ్యవ సాయ కూలీ. ఇతనికి నలుగురు కుమార్తెలు ఉన్నారు. బుధవా రం శివన్న ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగాయి. టీవీ, ఫ్రిజ్, వంట పాత్రలు సహా వస్తువులన్నీ కాలి పోయాయి. ఈ ప్రమాదంలో రూ.లక్ష విలువైన ఆస్తి నష్టపోయి నట్లు అంచనా వేశామని, ఈ మేరకు ప్రభుత్వానికి నివేదికను పంపిస్తామని వీఆర్వో నరేంద్ర తెలిపారు. తక్షణ సాయంగా ఆ కుటుంబానికి ఒక్క బియ్యం ప్యాకెట్‌తో పాటు నిత్యావసర సరుకు లు అందించారు. సింగిల్ విండో మాజీ ఛైర్మన్ సంపతికోట కిట్ట న్న బియ్యం ప్యాకెట్‌తో పాటు, రూ.5వేలు అందించి మాన వ త్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఎం. చిన్నరెడ్డెప్ప, తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా.. ఒకరి మృతి



నిమ్మనపల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ బోల్తా పడడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై తిప్పేస్వామి తెలిపిన వివరాల మేరకు మండలంలోని రాచవేటి వారిపల్లి పంచాయతీ ఎగువమాచిరెడ్డిగారిపల్లికి చెందిన చంద్రారెడ్డి ఇటుకల ఫ్యాక్టరీలో ఒరిస్సాకు చెందిన పోదన్(29) పని చేస్తున్నాడు. బుధవారం డ్రైవర్ దీపక్‌తో కలసి ఇటుకలను బోయ కొండలో అన్‌లోడ్ చేసి తిరిగి వస్తుండగా బోయకొండ ఆర్చి వద్ద వారు ప్రయాణిస్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పోదన్ ట్రాక్టరులో ఇరుక్కుని అక్కడికక్కడే వృతి చెందగా, డ్రైవర్ దీపక్ తప్పించుని పారిపోయాడు. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు సమాచారం అందించడంతో పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డీఈసీ సభ్యుడు శివహరిప్రసాద్ రెడ్డి మృతి

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణ కమిటీ (డీఈసీ) సభ్యుడు ఎస్.శివహరి ప్రసాద్‌రెడ్డి గుండెపోటుతో మృతి చెందినట్లు డీఈసీ కన్వీనర్ ఆర్ఐఓ వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మృతి పట్ల ఆర్జేడీ రవితో పాటు డీఈసీ సభ్యులు, అధ్యాపకులు సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులను ప్రగాఢ సానుభూతి తెలిపారు.


శివహరిప్రసాద్‌రెడ్డి(ఫైల్)

నిత్యపూజయ్యా.. నీ లీలలు ఎక్కడయ్యా...!

● శివభక్తులకు తప్పని ఇబ్బందులు ● అడుగడుగునా ట్రాఫిక్ జామ్


కాలినడకన అటవీ ప్రాంతంలో నిలిచిపోయిన భక్తుల రాకపోకలు

సిద్దవటం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): శివరాత్రి పర్వదినం సందర్భం గా 'నిత్యపూజయ్యా..! నీ లీలలు ఎక్కడయ్యా!!' అంటూ నిత్యపూజయ్య కోనకు వెళ్లే భక్తులు నిట్టూర్పు విడిచారు. మండలంలోని నిత్యపూజేశ్వర శివరాత్రి మహోత్సవాల సందర్భంగా శివపార్వతుల దర్శనానికి జిల్లా నలుమూలల నుంచి బుధవారం భక్తులు పోటెత్తారు. పంచలింగాల గుడి నుంచి కాలినడకన శివపార్వతుల దర్శనానికి వెళ్లే భక్తులకు మార్గమధ్యంలో మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 3 వరకు రాకపోకలు నిలిచిపోయాయి. తగు జాగ్రత్తలు తీసుకోవడంలో అధికారులు విఫలమయ్యారు.

సన్నిదానంలో గర్భగుడి వద్ద భక్తుల రద్దీ ఎక్కువ కావడంతో గంటల తరబడి నిలిచిపోయారు. దీంతో స్వామివారికి మొక్కుబడులు తెచ్చేవారికి మార్గమధ్యంలో ఇబ్బందులు తలెత్తాయి. మార్గమధ్యంలో రెండో ముఖద్వారం ఆశ్రమం నుంచి పంచలింగాల గుడి వరకు ఏర్పాటు చేసిన రహదారిపై దుమ్ము ఎగిసి పడడంతో భక్తులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. పంచలింగాల గుడి నుంచి సన్నిదానం వరకు అడుగడుగునా భక్తులకు ఇబ్బందులు తలెత్తాయి.


నిత్యపూజకోనకు వెళ్లే రహదారిలో దుమ్ము

రామాలయంలో చోరీ

కొండాపురం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండ్లూరు రామాలయంలో మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆలయం తలుపులు పగులగొట్టి.. ఆలయంలోని బీరువాలో ఉంచిన సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ స్వాములకు చెందిన నాలుగు వెండికిరీటాలను చోరీ చేసినట్లు ఆలయ నిర్వాహకుడు పి.సుబ్బారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. 900 గ్రాములు వుండే వీటి విలువ సుమారు రూ.50వేలు ఉంటుందని తెలిపారు. కొండాపురం సీఐ మహమ్మద్‌రఫీ సంఘటన స్థలాన్ని పరిశీలించి... క్లూస్ టీం బృందంతో వివరాలను సేకరించారు. ఆలయ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బంగారు గాజులు, నగదు అపహరణ

సుండుపల్లి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేద్దినేనికాలువ గ్రామపంచాయతీ రెడ్డివారిపల్లెకు చెందిన డీలర్ కరుణ తన రెండు బంగారు గాజులు, రూ.20వేలు నగదు గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం సుండుపల్లెకు సమావేశానికి వచ్చిన సమయంలో ఈ దొంగతనం జరిగినట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

స్టైఫండ్ పెంచి న్యాయం చేయాలి

ప్రొద్దుటూరు రూరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పశువైద్య కళాశాల విద్యార్థుల స్టైఫండ్‌ను పెంచాలనే న్యాయపరమైన డిమాండ్‌పై ప్రభుత్వం వెంటనే స్పందించాలని విద్యార్థులు పేర్కొన్నారు. బుధవారం 24వ రోజు సమ్మెలో భాగంగా కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన నిరవధిక సమ్మె శిబిరంలో కూర్చొని నిరసన తెలిపారు.

మతి స్థిమితం లేని యువకుడు తల్లిదండ్రులపై కత్తితో దాడి

రాజంపేట టౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): రాజంపేట పట్టణం బలిజపల్లె పూసలకాలనీలో బుధవారం తెల్లవారుజామున మతి స్థిమితం లేని యువకుడు తన తల్లిదండ్రులపై కత్తితో దాడి చేయడంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా... ప్రేమసాయికి భార్యతో పాటు ఇరువురు పిల్లలున్నారు. అతని వేధింపులు తాళలేక భార్య చాలరోజల కింద టపుట్టింటికి వెళ్లిపోయింది.

ఈ నేపథ్యంలో ప్రేమసాయి తన కుమారుని తెల్లవారుజామున బయటకు తీసుకెళుతుండగా ఏమైనా చేస్తాడేమోనని అతన్ని తల్లిదండ్రులు అడ్డుకున్నారు. దీంతో మానసిక స్థితి సరిగా లేని ప్రేమసాయి తన జేబులోని పిడుబాకుతో తండ్రి శ్రీరాములు, తల్లి నాగమ్మల వీపు, పొట్టపై కత్తితో దాడి చేయడంతో తీవ్రగాయలయ్యాయి.దీంతో వెంటనే వారిని కడప రిమ్స్‌కు తరలించారు. ప్రేమసాయిని రాజంపేట పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.


దాడిలో తీవ్రంగా గాయపడిన నాగమ్మ



ప్రేమసాయి (ఫైల్ ఫొటో)

పేదలకు శుభవార్త

- ఇంటి స్థలాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
- ఈ ఏడాది చివరి వరకు దరఖాస్తుకు గడువు

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అభ్యంతరం లేని ప్రభుత్వ భూములను ఆక్రమించు కుని నివాసాలు ఏర్పాటు చేసుకున్న పేదలకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. అలాంటి గృహాలను క్రమబద్ధీకరించేందుకు జీవో నెంబరు 30 జారీ చేస్తూ మార్గదర్శకాలను జారీ చేసింది. ఇన్నాళ్లు ఆక్రమణల పేరుతో పేదల నివాసాలను కూల్చి వేస్తుండటంతో వారు జీవితాంతం కష్టపడి పైసా పైసా కూడబెట్టుకున్న సొమ్ము మట్టిపాలు అవుతోంది. దీనిని గుర్తించిన పలువురు ప్రజాప్రతినిధులు ప్రభుత్వ భూముల్లో గృహాలు ఏర్పాటు చేసుకున్న పేదల ఇళ్లను క్రమబద్ధీకరించాలంటూ ప్రభుత్వానికి విన్నవించారు. దీంతో పేదల ఆర్థిక స్థితిని బట్టి అంచనాలు వేస్తూ కూటమి సర్కారు వంకలు, వాగులు, చెరువుల్లో ఆక్రమణలు కాకుండా.. అభ్యంతరం లేని ప్రభుత్వ స్థలాల్లో చేపట్టిన నిర్మాణాల క్రమబద్ధీకరణకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తూ మార్గదర్శకాలు జారీ చేసింది.

నిబంధనలు ఇలా..

2019 సంవత్సరానికి ముందు నిర్మించుకున్న గృహాలు, భూములు క్రమబద్ధీకరణ జరిగేలా 2019 అక్టోబరు 15 కటాఫ్ డేట్ విధించింది. నిబంధనలు అనుసరించి అర్హతలు ఉంటే ప్రభుత్వం క్రమబద్ధీకరణ చేస్తూ మహిళల పేరుపై పట్టాలివ్వనుంది. తహసీల్దార్ల పర్యవేక్షణలో గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది అక్రమ నిర్మాణాలను గుర్తించనునున్నారు. ఈ జాబితాలో అభ్యంతరాల స్వీకరణ, సబ్ డివిజన్ అప్రూవల్ కమిటీ ప్రకటించిన అనంతరం అర్హులకు ఇళ్ల పట్టాలు అందనున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పన్ను చెల్లింపుదారులు, నాలుగు చక్రాల వాహన దారులు ఈపథకానికి అర్హులు కారు. వ్యవసాయ పనులకు ఉపయోగించే ట్రాక్టర్లు, ట్యాక్సీ, ఆటోలకు మాత్రం మినహాయింపు ఇవ్వనున్నారు. లబ్ధిదారులకు కన్వెన్షన్ డీడ్ అందజేసిన రెండేళ్ల తరువాత యాజమాన్య హక్కులు కల్పించేలా ప్రభుత్వ నిర్ణయం తీసుకుంది.

ఫీజులు ఇలా..

క్రమబద్ధీకరణకు సంబంధించి 150 గజాల స్థలం వరకు ఎలాంటి రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించనక్కర లేదు. 151-300 గజాల వరకు రిజిస్టర్ ఫీజులో నిరుపేదలు 15 శాతం, పేదరికానికి ఎగువనున్న వర్గాలు 50 శాతం చెల్లించాలి. 301-450 వరకు బీపీఎల్ వర్గాలు ప్రాథమిక విలువ ప్రకారం 100 శాతం, రిజిస్ట్రేషన్ ఫీజులో 50 శాతం చెల్లించాలి. ఏపీఎల్ వర్గం వారు ప్రాథమిక విలువలో 200 శాతం చెల్లించాలి. 451 గజాల నుంచి ఆపై ఆక్రమించిన నిర్మాణాలకు బీపీఎల్, ఏపీఎల్‌తో సంబంధం లేకుండా నిర్మాణాలను నిర్దాక్షిణ్యంగా తొలగించేలా తాజాగా విడుదల జేసిన జీవోలో పొందుపరిచారు. ఈమేరకు జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు ఒక ప్రకటన విడుదల చేశారు.



వాల్మీకిపురం కోనేటివీధి ఆలయంలో విశేష పూజలందుకుంటున్న కామేశ్వరస్వామివారు



కొండాకోనల్లో కొలువైన శివాలయాలు ప్రశాంత నిలయాలు.. మహాశివరాత్రి రోజు మహాదేవుని దర్శనం సర్వపాప హరణం.. భక్తులు కోరిన కోర్కెలు తీర్చే బోళాశంకరుడిని హర..హర..మహాదేవ.. శంభో శంకర.. పాహిమాం అంటూ భక్తులు పూజించారు. శివరాత్రి జాగరణ చేసి జంగమయ్యను సేవించి తరించారు. ముక్కంటీశ్వరుడిని దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు.

హర.. హర.. మహాదేవ..

● శైవక్షేత్రాలకు పోటెత్తిన భక్తులు ● శివనామస్మరణతో మార్మోగిన శివాలయాలు ● వైభవంగా మహాశివరాత్రి ఉత్సవాలు

మదనపల్లె టౌన్/రూరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణం, రూరల్ మండలంలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. దేవళంవీధిలోని సోమేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా స్వామివారి పూజలో పాల్గొన్నారు. సీటీ ఎం రోడ్డులోని మంజునాథస్వామి ఆలయంలో, నీరుగట్టు వారిపల్లెలోని చౌడేశ్వరి సర్కిల్ నీలకంఠేశ్వరాలయంలో, కనకదాస్ నగర్‌లోని సిద్ధిలింగేశ్వరస్వామి ఆలయంలో, సీటీఎం గ్రామంలోని గెవిగంగాధర ఆలయంలో, దేవతానగర్‌లోని రాజరాజేశ్వరిదేవి ఆలయంలో అభిషేకాలు, ప్రత్యేకపూజలు చేశారు. వేంపల్లె మల్లయ్యకొండలో మల్లేశ్వరస్వామికి, చిప్పిలి గ్రామంలోని మడికయ్యల శివాలయంలో యోగభోగేశ్వరస్వామికి భక్తులు పూజలు చేసి దర్శించుకున్నారు.

పీలేరులో..: మహాశివరాత్రి పర్వదినాన్ని పీలేరు మండల ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానం, శివరామపురంలోని భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయం, అడవిపల్లె మద్దుండాల మల్లేశ్వరస్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, విశేష అలంకరణల అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో ఉదయం రుద్రాభిషేకం, సాయంత్రం గిరిజాకల్యాణం, రాత్రి లింగోద్భవ సమయంలో స్వామివారికి 108 లీటర్ల పాలతో క్షీరాభిషేకం చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆయా ఆలయాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

తంబళ్లపల్లెలో..: మహాశివరాత్రి పర్వదినాన మల్లయ్యకొండతో పాటు మండలంలోని శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. బుధవారం తెల్లవారుజాము నుంచే శివాలయాలకు భక్తులు పోటెత్తారు. స్థానిక సోమేశ్వర స్వామి ఆలయంలో ఉదయం స్వామివారికి అర్చనలు, పూజలు, సాయంత్రం ఆదిదంపతులకు కనులపండువగా కల్యాణం నిర్వహించి ఆలయ పురవీధుల్లో ఊరేగించారు. ఆలయం వద్ద నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మల్లయ్యకొండ శివనామస్మరణతో మార్మోగింది. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్నాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి భక్తులు తరలి రావడంతో కొండ భక్తులతో కిక్కిరిసిపోయింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి సహస్ర నామార్చన, రుద్రాభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లె జయచంద్రారెడ్డి, కల్పనారెడ్డి దంపతులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. అదే విధంగా తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు, నియోజకవర్గ సమన్వయకర్త నీడ్ మల్లికార్జుననాయుడు, జనసేన ఇన్‌చార్జి పోతుల సాయినాథ్ స్వామి వారిని దర్శించుకున్నారు. బ్రహ్మోత్సవాలలో భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా సీఐ లక్ష్మన్న, ఎస్‌ఐ లోకేష్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

వాల్మీకిపురంలో..: పట్టణంలోని కోనేటివీధిలో వెలసిన శివాలయంలో ఉదయం సుప్రభాత సేవ, రుద్రాభిషేకాలు, విశేషాలంకరణలతో కామేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పట్టణ పడమర పొలిమేరల్లోని ధర్మపథం సమూహాలయంలో లింగోద్భవ మహా శివుడికి అభిషేకాలు, చింతపర్తి ఓబులేశ్వరస్వామి దేవాలయం, ఏటిగడ్డ శివాలయాలలో ప్రత్యేక పూజలు జరిగాయి. రాత్రికి శివపార్వతుల కల్యాణం, తదితర కార్యక్రమాలకు ఏర్పాట్లు చేశారు. అలాగే పట్టణ సమీపంలోని వీరభద్రాద్రి(వీరన్నకొండ)పై రాత్రి జాగరణ, అభిషేకాలు, గురువారం ఉదయం వీరభద్రస్వామికి విశేష పూజలు, అన్నదాన కార్యక్రమాలు చేపట్టనున్నారు.

గుర్రంకొండలో..: మండలంలోని శివాలయాలు శివనామస్మరణతో బుధవారం మార్మోగాయి. మహాశివరాత్రి సందర్భంగా గుర్రంకొండ సిద్దేశ్వరస్వామి ఆలయం, బురుజుపల్లె ఉమామహేశ్వరస్వామి ఆలయం, ప్యారంపల్లె కాశీవిశ్వనాథ ఆలయం, సరిమడుగు మల్లికార్జున స్వామి ఆలయం, సిద్దేశ్వర ఆలయంతోపాటు పలు ఆలయాల్లో రుద్రాభిషేకం, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

కలకడలో..: కలకడ సత్యవతి నదీ తీరాన వెలసిన కామాక్షి సమేత సిద్ధేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం స్వామివారిని గజ వాహనంపై ఊరేగించారు. కోలాటాలు, చెక్కభజనలు, బాణాసంచా పేల్చుతూ అంగరంగ వైభవంగా స్వాగతించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అంతకుమునుపు ఆలయంలో కామాక్షి సమేత సిద్ధేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. మహాశివరాత్రిని పురష్కరించుకొని కామాక్షి సమేత సిద్ధేశ్వరస్వామి ఆలయంలో ఉదయం రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు, నడిమిచెర్ల అగ్రహారంలో వెలసిన ద్రాక్షాయని సమేత శంకరనారాయణస్వామి ఆలయం, నవాబ్‌పేట చావడికాడపల్లెలో గుండాల మల్లికార్జునస్వామి ఆలయం, గంగాపురంలోని కోటిలింగేశ్వరస్వామి ఆలయం, ఎల్లమగుడి బండకు సమీపంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రవీంద్రశర్మ, కమిటీ సభ్యులు మద్దిపట్ల వెంకటరమణనాయుడు, కె.రెడ్డెప్పనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కురబలకోటలో..: మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా ఆలయాలను ప్రత్యేకంగా విద్యుత్ దీపాలతో అలంకరించారు. అంగళ్లు సమీపంలో వెలసిన మల్లయ్యకొండలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాన్ని కమిటీసభ్యులు ఏర్పాటు చేశారు.

పెద్దతిప్పసముద్రంలో..: పెద్దతిప్పసముద్రం మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో ఉన్న శైవక్షేత్రాలు శివనామ స్మరణతో మార్మోగాయి. వేకువ జాము నుంచే శివాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. టి.సదుం పంచాయతీ చెన్నరాయునిపల్లె సమీపంలోని పార్వతీ సమేత సంఘమేశ్వరస్వామి ఆలయం, అంకిరెడ్డిపల్లెలో వెలసిన భైరవేశ్వరస్వామి ఆలయం, రంగసముద్రంలో రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వివిధ ఆలయాల్లో స్వామివారి కల్యాణోత్సవాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక వీటీఎంలో వెలసిన చంద్రమౌళేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నిమ్మనపల్లిలో..: మండలంలోని తవళం అటవీ ప్రాంతంలో వెలసిన నేలమల్లేశ్వరస్వామి, కొండయ్యగారిపల్లి పంచాయతీ ఊట్లవంకలో వెలసిన సోమేశ్వర ఆలయాలు శివరాత్రి సందర్భంగా శివనామ స్మరణతో మార్మోగాయి. ఉదయం నుంచి భక్తులతో కిటకిట లాడాయి. స్వామి వారికి రుద్రాభిషేకం, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

పెద్దమండ్యంలో..: మండలంలోని శివాలయాలు శివనామ స్మరణతో మార్మోగాయి. పెద్దమండ్యం, పాపేపల్లి, నగిరి, ముసలికుంట, శివపురం నేలమల్లయ్యస్వామి, మందలవారిపల్లి, తాటామాకులపల్లి, సిద్దవరం తదితర గ్రామాల్లో వైభవంగా శివరాత్రి ఉత్సవాలు జరిగాయి. కాలినడకన మల్లయ్యకొండకు వెళ్లే భక్తులను నేలమల్ల య్యస్వామి గుడి వరకు ట్రాక్టర్లలో ఉచితంగా తరలించారు.

బి.కొత్తకోటలో..: బి.కొత్తకోటలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని చౌళేశ్వరాలయం, సాయిబాబా ఆలయంలో పార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవం కనులపండువగా జరిగింది. బీరంగి పంచాయతీ పరిధిలో వెలసిన బండెన్నస్వామి ఆలయంలో శివరాత్రి వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. ఉదయమే మహాశివుడితో పాటు బండెన్నస్వామి విగ్రహానికి ప్రత్యేకపూజలు, అర్చనలు చేశారు. చుట్టుప్రక్కల గ్రామాల నుంచే కాక దూర ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొన్నారు.

రామసముద్రంలో..: రామసముద్రం మండలంలోని శివాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. చెక్‌పోస్టు కూడలిలో ఉన్న శివాలయం, దిగువ పేటలోని శివాలయం అలాగే చెంబకూరు, మూగవాడి, వాలీశ్వరాలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. వాలీశ్వరాలయంలో దేవదాయ శాఖ ఈవో రమణ, సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ రవికుమార్, ఆలయ కమిటీసభ్యులు స్వామివారికి పూజలు చేశారు.

కలికిరిలో..: పట్టణ నడిబొడ్డులో వున్న పురాతన శివాలయంలోని పార్వతీ సమేత సోమేశ్వరస్వామి కల్యాణోత్సవం బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ముందుగా ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, రుద్రాభిషేకం, అలంకరణలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. గుట్టపాలెం పూలకొండలో వెలసిన మల్లేశ్వరస్వామికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. రాత్రి జాగరణ సందర్భంగా హరికథా కాలక్షేపం ఏర్పాటు చేశారు.

ములకలచెరువులో..: మండలంలో బుధవారం మహాశివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ములకలచెరువు సమీపంలోని కనుగొండ రాయస్వామి, రామాపురంలోని రామలింగేశ్వరస్వామి, ఉమాశంకరరెడ్డి కాలనీలోని భక్త మార్కండేయ శివాలయం, గూడుపల్లిలోని శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కనుగొండ రాయస్వామి ఆలయంలో టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అమ్మవారితో కలిసి ఆలయానికి చేరుకుంటున్న అడవిపల్లె మద్దుండాల మల్లేశ్వరుడు



పీలేరు కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో స్వామి, అమ్మవారి కల్యాణోత్సవం



కలకడ సిద్ధేశ్వరస్వామిని గజవాహనంపై ఊరేగిస్తున్న దృశ్యం



దేవళంవీధిలోని సోమేశ్వరస్వామి ఆలయంలో పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



నీలకంఠేశ్వరస్వామి దర్శనానికి వేచివున్న భక్తులు



ములకల చెరువులో ప్రత్యేక అలంకరణలో కనుగొండ రాయస్వామి



పెద్దమండ్యం నేలమల్లయ్యస్వామి గుడి వద్ద ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమం



రామసముద్రంలోని శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు





కలికిరిలో.. బి.కొత్తకోటలో వైభవంగా పార్వతీ సమేత సోమేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు



భక్తులతో కిటకిటలాడుతున్న మల్లయ్యకొండ ఆలయం

మినరల్ వాటర్ ప్లాంటును ప్రారంభిస్తున్న ముప్పవరపు నాగరాజ నాయుడు, తదితరులు



వాటర్ ప్లాంటు ఏర్పాటు చేసిన ఎన్ఆర్ఐ

పీలేరు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): అమెరికాలోని డల్లాస్‌లో స్థిరపడిన కేవీపల్లె మండలం గాలివారిపల్లెకు చెందిన వ్యాపారవేత్త ముప్పవరపు నాగరాజనాయుడు బుధవారం తన స్వంత నిధులతో గాలివారిపల్లెలో మినరల్ వాటర్ ప్లాంటును ప్రారంభించారు. ఆయన 'ముప్పవరపు చారిటబుల్ ట్రస్టు' పేరుతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో గాలివారిపల్లెతో పాటు పొరుగు గ్రామాలైన పిచ్చిగుంటపల్లె, బొప్పసముద్రం, బురుజుకాడపల్లె గ్రామాల్లోని నీటిలో ఫ్లోరైడ్ శాతం ఎక్కువగా ఉందని తెలుసుకున్న ఆయన రూ.5 లక్షల స్వంత నిధులతో మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటు చేశారు. మహాశివరాత్రి సందర్భంగా ఈ వాటర్‌ప్లాంటును తన తల్లిదండ్రులైన ముప్పవరపు ముత్యాలయ్య, లక్ష్మీదేవిల సమక్షంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగరాజనాయుడును గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో గాలి అవని కుమార్, గాలి నవీన్ నాయుడు, మద్దిపట్ల అంజి, గాలి బాబునాయుడు, రవి నాయుడు, పెద్ద వెంకటరమణ, సోంపల్లె నరేశ్, వినయ్, లక్ష్మీరెడ్డయ్య నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఖాజీగా జలాలుద్దీన్ నియామకం

● మైనారిటీ సంక్షేమశాఖ ఉత్తర్వులు



మదనపల్లె టౌన్/అర్బన్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మద నపల్లె నియోజకవర్గ ప్రభుత్వ ఖాజీగా మహమ్మద్ జలాలుద్దీన్‌ను నియమిస్తూ రాష్ట్ర మైనారిటీ సంక్షేమశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. పట్టణంలోని సైదాపేటకు చెందిన మహమ్మద్ అబ్దుల్లా కుమారుడు జలాలుద్దీన్ ప్రభుత్వ ఖాజీగా ముస్లిం మైనారిటీల వివాహాలు నిర్వహిస్తారు. ఆయన ఈ పదవిలో పదేళ్లపాటు వుంటారు. ఈ సందర్భంగా ఖాజీ జలాలుద్దీన్ సీఎం చంద్రబాబును కలసి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మైనారిటీ సంక్షేమశాఖ సలహాదారుడు ఎన్ఎండీ ఫరూఖ్, ఎమ్మెల్యే షాజహాన్‌బాషాలకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు రెడ్డిసాహెబ్, రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఎస్కే బాషా నూతన ఖాజీని మార్యదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

దాడిలో గాయపడిన రెవెన్యూ అధికారులకు పరామర్శ

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): దేవతానగర్‌లో ఆక్రమాలను తొలగించడానికి వెళ్లిన ఆర్ఐ, వీఆర్వోపై కర్రతో, కొడవలితో దాడిచేసిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. తాలుకా పోలీస్‌స్టేషన్‌లో బుధవారం వారిని కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెవెన్యూ అధికారులపై దాడికి పాల్పడడం దారుణమని, ప్రభుత్వ భూమిని ఆక్రమించేవారిపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు.

భూముల ఆన్‌లైన్‌లో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం

● బీసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వల్లనే మదనపల్లెలోని ఎగువ కురవంకలో ఈ సంఘటన చోటు చేసుకుందని బీసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు బోడెం రాజశేఖర్ అన్నారు. గాయపడినవారిని బుధవారం ఆయన జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మదనపల్లె మండలం ఎగువ కురవంకకు చెందిన లక్ష్మప్ప కుమారుడు వెంకటేష్ యాదవ్(45)కు మదనపల్లె మండలం వేంపల్లె గ్రామం తిప్పారెడ్డిగారిపల్లెలో ఆరున్నర ఎకరాల పొలం ఉందని, ఇందులో మూడున్నర ఎకరాలకు పాస్‌బుక్కు, రికార్డులు ఉన్నప్పటికీ రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. దీని కోసం లక్షల్లో అప్పులు చేస్తున్నారని తండ్రి లక్ష్మప్ప, వెంకటేష్ మధ్య బుధవారం ఉదయం వాగ్వాదం జరిగిందని, మనస్తాపానికి గురైన తండ్రి చనిపోతానంటూ ఉరి వేసుకోవడానికి పరుగులు తీశారని, అతన్ని అడ్డుకునే ప్రయత్నంలో ఇద్దరూ కిందపడిపోయారన్నారు. దీంతో ఇరువురికీ గాయాలయ్యాయని, కుటుంబసభ్యులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారని తెలిపారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు రైతులను, నిరుపేదలను ఇబ్బందులు పెట్టకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీసీ హక్కుల పోరాట సమితి ఏపీ రాష్ట్ర గౌరవసలహాదారుడు కొత్తూరు చిన్నరెడ్డెప్ప, నాయకులు గౌస్, ఖాదర్, వీరభద్ర తదితరులు పాల్గొన్నారు.



గాయపడిన వెంకటేశ్‌ను పరామర్శిస్తున్న రాజశేఖర్

అడవిని కాపాడడం అందరి బాధ్యత

నిమ్మనపల్లి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): అడవులను కాపాడి వన్యప్రాణులను రక్షించడం మన అందరి బాధ్యత అని డీఆర్‌వో మదనమోహన్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని తవళం బీట్‌లోని పారేసువారిపల్లి, ఉంటావారిపల్లి, ఎగువపల్లి, తవళం శివాలయం గుడి దగ్గర అడవికి నిప్పు అనే కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఆర్‌వో మాట్లాడుతూ వన్యప్రా ణులను వేటాడడం చట్టరీత్యా నేరమని, అడవికి నిప్పు పెడితే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌బీవో దీప, త్యాగరాజ్, తదితరులు పాల్గొన్నారు.

ఆప్కాస్ రద్దును విరమించుకోవాలి

● సీఐటీయూ డిమాండు

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ఆప్కాస్ రద్దు ప్రయత్నాలను ప్రభుత్వం విరమించుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మదనపల్లె మున్సిపల్ కార్మికులు, సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో పోస్టుకార్డులు రాసి ముఖ్యమంత్రికి పోస్టు చేసినట్లు సీఐటీయూ జిల్లా కోశాధికారి హరిశర్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆప్కాస్ రద్దు వలన ప్రైవేట్ ఏజెన్సీలకు, కాంట్రాక్టర్లకు మేలు జరుగుతుందన్నారు. మున్సిపాలిటీల్లో తక్కువ జీతాలకు పని చేస్తున్న కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులు గుర్తించాలని, అన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న జీతాలు, ఈఎస్ఐ, పీఎఫ్‌లు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో చలపతినాయుడు, సాంబశివనాయక్, రామకృష్ణ, కృష్ణప్ప, గోపాల్, బాలకృష్ణ, చంద్ర, రాజు, మునుస్వామి, నరసింహులు, అరవింద్, శంకర్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.



పోస్టు కార్డులతో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

రోడ్డుపై గుంతలు పూడ్చాలి

● ఇబ్బందులు పడుతున్న వాహన చోదకులు
● బండ్రేవు ప్రజల ఆగ్రహం

పెద్దమండ్యం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): పెద్దమండ్యం మండలం బండ్రేవు బస్టాప్, సచివాలయం వద్ద తారురోడ్డు మరమ్మతులు చేయలేదని ఆ ప్రాంత ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఏడాది సంక్రాంతికి గుంతలు పడిన తారురోడ్లకు మరమ్మతులు చేయాలని కూటమి ప్రభుత్వం ఆదేశాల మేరకు పెద్దమండ్యం-తంబళ్లపల్లి రోడ్డు మార్గంలోని గుంతలకు మరమ్మతులు చేపట్టారు. కానీ ఈ మార్గంలోని బండ్రేవు బస్టాప్, సచివాయ సమీపంలో తారురోడ్డుపై ఉన్న గుంతలు పూడ్చకుండ అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం చేశారని వాపోయారు. రోడ్డు మరమ్మతులు చేయకపోవడంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని బండ్రేవులో తారురోడ్డుకు మరమ్మతులు చేయాలని మాజీ సర్పంచ్ వేమయ్య డిమాండ్ చేశారు.



బండ్రేవులో రోడ్డు పై ఏర్పడిన గుంతలు

ధర్మకర్తకు విరాళాన్ని అందిస్తున్న శ్రీనివాసులునాయుడు



గర్భగుడి నిర్మాణానికి రూ.లక్ష విరాళం

కలకడ, ఫిబ్రవరి26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రకోటపల్లి పంచాయతీలో వున్న కోటమిట్ట ఆంజనేయస్వామి ఆలయానికి కోషూరివాండ్లపల్లికి చెందిన అబ్బూరి శ్రీనివాసులునాయుడు రూ.లక్ష విరాళం అందించారు. ఈ మేరకు నగదును బుధవారం ధర్మకర్త భానుప్రసాద్‌కు అందజేశారు. ఈ నిధులను ఆలయ గర్భగుడి నిర్మాణానికి వినియోగించనున్నట్లు ధర్మకర్త తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ అబ్బూరి తిరుపతినాయుడు, భక్తులు పాల్గొన్నారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

● నాలుగు ద్విచక్ర వాహనాలు, నగదు స్వాధీనం

కలకడ, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని నడిమిచెర్ల సమీపంలో చింతతోపు వద్ద జూదం ఆడుతున్న ఏడుగురిని బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపారు. వారి నుంచి 10,450 నగదుతో పాటు, నాలుగు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో సిబ్బంది హరిబాబు, లక్ష్మీనారాయణ, రియాజ్, యూనష్, రమేశ్ పాల్గొన్నారు.

మదనపల్లెలో ఆరుగురు...

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఆరుగురు పేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్లు తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. బుధవారం మదనపల్లె మండలం కొండామరిపల్లె పంచాయతీ ఇసుకనూతనపల్లెలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకుని 12,600 నగదు స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. వారిని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు.

వ్యక్తిపై మందుబాబుల దాడి

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మందుబాబులు దాడి చేసి వ్యక్తిని గాయపరిచిన సంఘటన మదనపల్లె పట్టణం గొల్లపల్లెలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఆస్పత్రి అవుట్ పోలీసుల వివరాల మేరకు.. నీరుగట్టువారిపల్లె వెంకటేశ్వరపురానికి చెందిన సిద్దారెడ్డి కుమారుడు దాడం వేణుగోపాల్‌రెడ్డి(30), రవీంద్రారెడ్డి కుమారుడు మంజునాథరెడ్డి(38) గొట్లపల్లె బైపాస్‌రోడ్డులోని టీ స్టాల్ వద్ద టీ తాగి బైక్‌పై వెళ్లుతున్నారు. వీరిని సూరి, రాము, సతీష్, చోట్లు అనే నలుగురు రెండు బైకులపై వచ్చి దారికి అడ్డుపెట్టి దాడి చేశారని పోలీసులు పేర్కొన్నారు. దీంతో వేణుగోపాల్‌రెడ్డి తలకు గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం టూటౌన్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదుకు ఆస్పత్రి అవుట్ పోలీసులు రెఫర్ చేశారు.